# తెలంగాణ ముచ్చట్లు


TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం-23- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 88 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## రైతు సంక్షేమమే

## కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం -మంత్రి సీతక్క

- కొత్తగూడలో 12 లక్షల వ్యయంతో అంగన్వాడీ కేంద్రానికి శంకుస్థాపన
- రైతు భరోసా నిధుల రూపంలో తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్లు జమ
- యూరియా కొరతపై తప్పుడు ప్రచారం, కేంద్రం సరఫరాలో ఆలస్యం
- రోడ్లు, లైటింగ్, రహదారి విస్తరణకు త్వరలో చర్యలు




మహబూబాబాద్,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):

పనుల జాతర2025 లో భాగంగా కొత్తగూడ మండల కేంద్రంలో 12 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న అంగన్వాడీ కేంద్రానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శంకుస్థాపన చేశారు.

మిగతా 2లో

## "మిషన్ డాన్"...

### బాలుడి లేఖలో దాగిన రక్త చరిత్ర




- కూకట్‌పల్లిలో చిన్నారి హత్య కేసు వెనుక సంచలన నిజాలు వెలుగులోకి
- 80 వేలు చోరీ కోసం వేసిన ప్లాన్.. పేపర్‌పై రాసుకున్న 'మిషన్ డాన్'
- నిర్దాక్షిణ్యంగా 20 కత్తిపోట్లు.. హత్య తర్వాత పక్కనే దాక్కున్న నిందితుడు
- లేఖలో గ్యాస్ లీక్ చేసి ఇల్లు ధ్వంసం చేయాలన్న షాకింగ్ ప్లాన్
- మిషన్ డాన్...చిన్నారి హత్యతో బయటపడిన బాలుడి క్రూర పథకం





హైదరాబాద్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు): పదహారేళ్లకంటే తక్కువ వయసున్న ఓ బాలుడు వేసుకున్న పథకం సమాజాన్ని కుదిపేసింది. పదవ తరగతి కూడా పూర్తికాని వయసులోనే 'మిషన్ డాన్' పేరుతో ఒక లేఖ రాసి, చోరీ కోసం పెద్ద స్కెచ్ వేసి, చివరికి అమాయక చిన్నారి ప్రాణం తీశాడు. ఎలాంటి ఆధారాలు లేక కేసు మిస్టరీగా మారగా, ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా ఎస్‌వోటీ పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. అతని దగ్గర నుంచి బయటపడ్డ లేఖ, రక్తంతో ఉన్న బట్టలు, హత్యకు ఉపయోగించిన కత్తి.. ఈ కేసు వెనుక దాగిన దారుణాన్ని మొత్తం వెలుగులోకి తెచ్చాయి.

మిగతా 2లో

## ఈ నెల 25న తెలంగాణ మంత్రివర్గ సమావేశం..

- పంచాయతీ ఎన్నికల కోసం సెప్టెంబర్ 30 గడువు విధించిన హైకోర్టు
- ఎన్నికల్లో రిజర్వేషన్లు, ఎన్నికలపై మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం
- రిజర్వేషన్లు రాష్ట్రపతి వద్ద తేలకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం ఇచ్చే అవకాశం

2లో



## సిఎం రేవంత్ అండతో రాహుల్ జీవితానికి కొత్త వెలుగు

- రైలులో దాడికి గురై రెండు కాళ్లు కోల్పోయిన వరంగల్ విద్యార్థి రాహుల్
- పది లక్షల ఆర్థిక సహాయం అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎన్ఐఎంఎస్ లో ఆధునిక కృత్రిమ కాళ్లు అమర్చించుకుని మళ్లీ నడక ప్రారంభం
- కొత్త కలలతో ముందుకు సాగుతున్న రాహుల్,తల్లిదండ్రుల కృతజ్ఞతలు

2లో







## అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకే పనుల జాతర

- గౌరవెల్లి ప్రాజెక్టు రైతాంగానికి గుండెకాయ...
- పూర్తి చేయడం ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్





హనుమకొండ,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసి, కొత్త పనులకు శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వం పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారంలో అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, వీర్ల గడ్డ తండాలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి, అనంతరం మల్లార పాఠశాల ప్రాంగణంలో కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ, పనుల జాతర పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అనేక

మిగతా 2లో

## రాష్ట్ర బీజేపీ చీఫ్ అరెస్ట్..


- అరెస్ట్‌పై స్పందించిన కేంద్ర మంత్రి..
- బీజేపీ అంటే అంత భయమెందుకు
- కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రజా సమస్యలై సెక్రటేరియ్ వద్ద నిరసన కార్యక్రమానికి బీజేపీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యం లో చేవెళ్ల పర్యటనలో ఉన్న బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావును

మిగతా 2లో






## ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

- లైసెన్స్ తీసుకున్న కేబుళ్లు తప్ప ఏవీ ఉంచవద్దు : హైకోర్టు ఆదేశం
- జీహెచ్ఎంసీలో కేబుళ్ల తొలగింపుపై ఎయిర్‌టెల్ పిటిషన్‌పై విచారణ
- రామంతాపూర్‌లో ఐదుగురు మరణించిన ఘటనను ప్రస్తావించిన జడ్జి
- బర్త్‌డే రోజే తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడి ఘటనపై జడ్జి ఉద్వేగభరిత వ్యాఖ్యలు

3లో

## కేసీఆర్ హయాంలో రైతులు ఏనాడూ రోడ్డెక్కలేదు

- ఎరువుల కొరతపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించిన కేటీఆర్
- యూరియా కోసం కేసీఆర్ ప్రత్యేక ప్రణాళికలు వేసేవారని వెల్లడి
- ప్రస్తుత ప్రభుత్వ అసమర్థత వల్లే రైతులకు కష్టాలు అని ఆరోపణ
- రైతులను ఇబ్బంది పెట్టేవారి పతనం ఖాయమంటూ హెచ్చరిక

2లో



## వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

- 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులకు నోటిఫికేషన్
- టీఎస్ఎమ్ఎస్ హాస్పిటళ్లలో 1616, ఆర్టీసీ హాస్పిటల్‌లో 7 పోస్టులు
- సెప్టెంబర్ 8 నుంచి 22 వరకు దరఖాస్తుల గడువు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి రేవంత్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని హాస్పిటల్‌లో 1616, ఆర్టీసీ హాస్పిటల్‌లో 7 పోస్టులు భర్తీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా దరఖాస్తులకు సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ గడువు విధించింది తెలంగాణ ప్రభుత్వం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఈ నెల 25న తెలంగాణ మంత్రివర్గ సమావేశం..

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ నెల 25న సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరగనుంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి హైకోర్టు విధించిన గడువు సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఈ మంత్రివర్గ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడిరది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, ఎన్నికల నిర్వహణపై మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ శనివారం జరగనున్న టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహం ఖరారు కానుంది. రాష్ట్రపతి వద్ద తేలకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకుని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సిఫార్సు చేసే అవకాశం ఉంది.



# సిఎం రేవంత్ అండతో రాహుల్ జీవితానికి కొత్త వెలుగు

వరంగల్,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):

వరంగల్ జిల్లా గీసుగొండకు చెందిన ప్రతిభావంతుడైన విద్యార్థి రాహుల్ జీవితం విషాదకర సంఘటనతో మారిపోయింది. కోటా, రాజస్థాన్ లో ఐఐటీ ప్రవేశ పరీక్షల కోసం సిద్ధమవుతూ అక్కడికి రైల్లో ప్రయాణిస్తుండగా కొంతమంది దుండగులు అతడిపై దాడి చేసి రైలులో నుండి తోసివేయడంతో రెండు కాళ్లు కోల్పోయాడు.అలాంటి పరిస్థితుల్లో రాహుల్ కి తోడుగా నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పది లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఆ సహాయంతో హైదరాబాద్ ఎన్ఐఎంఎస్ ఆసుపత్రిలో ఆధునిక కృత్రిమ కాళ్లు అమర్చించుకున్న రాహుల్ ఇప్పుడు సౌకర్యవంతంగా నడుస్తున్నాడు.

ప్రతిభతో ముందుకు సాగాలన్న తన కలలు ఆగిపోలేదని రాహుల్ చెబుతున్నాడు. కొత్త ఆశతో ముందుకు సాగుతున్న తన కుమారుని కోసం ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ రాహుల్ తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రికి కృతజ్ఞతగా రాహుల్ స్వయంగా ఓ వీడియో రూపొందించి తన మనసులోని కృతజ్ఞతలను తెలియజేశాడు.



# రాష్ట్ర బీజేపీ చీఫ్ అరెస్ట్..

(మొదటి పేజీ తరువాయి)

మొయినాబాద్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో అక్రమ అరెస్టులతో రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తుందని బీజేపీ రాష్ట్ర చీఫ్ రామచందర్ రావు మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. చేవెళ్లలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయన్ని ఎందుకు అరెస్ట్ చేశారని ఈ సందర్భంగా పోలీసులను ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం గత బీఆర్ఎస్ బాటలోనే పయనిస్తుందని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తల అరెస్టులతో తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవాలనుకుంటుందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. అయినా బీజేపీ అంటే అంత భయమెందుకు అని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు.


ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన చేస్తున్న బీజేపీ కార్యకర్తలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటు అని అభివర్ణించారు. తక్షణమే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే అరెస్టయిన బీజేపీ కార్యకర్తలందరినీ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి సూచించారు. లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.



# కేసీఆర్ హయాంలో రైతులు ఏనాడూ రోడ్డెక్కలేదు

న్యూఢిల్లీ: , (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో నెలకొన్న ఎరువుల కొరతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎంతో ముందుచూపుతో వ్యవహరించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూశారని, కానీ ప్రస్తుత పాలనలో అన్నదాతలు రోడ్డెక్కే దుస్థితి ఏర్పడిరదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా బస్తాల కోసం రైతులు వ్యవసాయ సహకార సంఘాల వద్ద బారులు తీరుతున్నారని, ధర్నాలు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ పాలనలో ఒక్కసారి కూడా రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కలేదని ఆయన గుర్తుచేశారు. ఇది కదా నాయకత్వం అంటే, ఇది కదా ముందుచూపు అంటే అంటూ కేసీఆర్ పాలనలో తీసుకున్న చర్యలను ఆయన వివరించారు.



కేసీఆర్ నాయకత్వ పటిమను, ఆయన ముందుచూపును కేటీఆర్ ఈ సందర్భంగా వివరించారు. ''సీజన్‌కు ముందే వ్యవసాయ అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించి, కేంద్రానికి కచ్చితమైన లెక్కలతో వినతులు పంపేవారు. ఏపీలోని నౌకాశ్రయాలకు మన అధికారులను పంపి, దక్షిణ మధ్య రైల్వే అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి 25 ప్రత్యేక గూడ్స్ రైళ్లను ఏర్పాటు చేయించేవారు. అంతేకాకుండా, పొరుగు రాష్ట్ర రవాణా మంత్రులతో నేరుగా సంప్రదించి సుమారు 4 వేల లారీలను సిద్ధం చేసి, పోర్టుల నుంచి నేరుగా మండలాలకు యూరియా చేరేలా పక్కా ప్రణాళికలు రచించేవారు'' అని కేటీఆర్ తెలిపారు. ''పరిపాలన చేతకాని అసమర్థులు రాష్ట్రాన్ని ఏలడం వల్లే రైతులకు ఈ కన్నీళ్లు మిగిలాయని'' కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ''ఒకవైపు కేసీఆర్ వందేళ్ల విజన్‌తో పనిచేస్తే, మరోవైపు కొందరికి విమర్శలు చేయడం తప్ప పనులు చేయడం రాదని ప్రజలు గ్రహించారని'' అన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారి పతనం ప్రారంభమైందని ఆయన హెచ్చరించారు. ''జై కిసాన్.. జై కేసీఆర్'' నినాదంతో తన వ్యాఖ్యలను ముగించారు.

# వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఈ పోస్టుల భర్తీతో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగనున్నాయి. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు మరింత మెరుగవనున్నాయి. పల్లెలకు స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ అవనున్నాయి. ఆరోగ్యశాఖలో ఇప్పటికే సుమారు 8 వేల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 7 వేల పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.




# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం -మంత్రి సీతక్క

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రైతు సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వమే ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేసిందని తెలిపారు. ఇందిరా గాంధీ కాలం నుంచి హరిత విప్లవం, నదులపై ప్రాజెక్టులు, వ్యవసాయ అభివృద్ధి కోసం కాంగ్రెస్ తీసుకున్న చర్యలు చరిత్రలో నిలిచిపోయాయని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంతోషం కోసం కృషి చేస్తోందని, ఇటీవలే తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు వివరించారు.



యూరియా సరఫరాపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆమె విమర్శించారు. కేంద్రం నుండి రాష్ట్రానికి తగినన్ని నిల్వలు అందకపోవడం వల్ల కొంత కొరత ఏర్పడిందని, దళారీల దందాలను అరికట్టేందుకు పోలీసు, వ్యవసాయ శాఖలకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించామని చెప్పారు. రైతులు ఆందోళన చెందవద్దని, యూరియా సరఫరా వేగవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల విషయంలో కొత్తగూడ, గంగారం ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, టౌన్ సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. దుబ్బగూడెం రహదారి పనులు అటవీ శాఖ అనుమతులతో త్వరలో ప్రారంభమవుతాయని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యతగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకే పనుల జాతర

(మొదటి పేజీ తరువాయి)

పనులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోనే 46 పనులు ప్రారంభమవుతున్నాయని చెప్పారు.

**గౌరవెల్లి ప్రాజెక్టు ప్రాధాన్యం**

ప్రాంత ప్రజలకు జీవనాడిలాంటి గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టుకు భూములు ఇవ్వడంలో రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాలువలు పూర్తయితే భూముల విలువ పెరగడంతోపాటు ఆదాయాలు కూడా పెరుగుతాయని గుర్తుచేశారు. భూములు ఇచ్చేటప్పుడు కొంత ఇబ్బందిగా అనిపించినా, భవిష్యత్తు దృష్ట్యా ఇది రైతాంగానికి మేలు చేస్తుందని నొక్కి చెప్పారు.



**నిధుల కేటాయింపు, భూసేకరణ**

ప్రాజెక్టు భూసేకరణ కోసం ఇప్పటికే హనుమకొండ జిల్లాకు రూ.25 కోట్లు మంజూరైనట్లు మంత్రి వివరించారు. త్వరలో కరీంనగర్, సిద్దిపేట జిల్లాలకు కూడా నిధులు విడుదల కానున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్గదర్శకత్వంలో ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఎన్జీటీ కేసులను సైతం పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నామని, రెవెన్యూ యంత్రాంగం భూసేకరణ ప్రక్రియలో నిమగ్నమై ఉందని పేర్కొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారం**

పనుల జాతర ద్వారా అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీలు, రోడ్లు వంటి మౌలిక వసతుల సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం గత పది సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైందని, ఇప్పుడు ప్రభుత్వం సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. ఇండస్ట్రియల్, విద్య, వైద్య, వ్యవసాయ రంగాలన్నింటిలోనూ పనులు కొనసాగుతున్నాయని వివరించారు.

**నీటి పంపిణీ హామీ**

గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా నీటిలో ఇబ్బందులు తలెత్తితే దేవాదుల ద్వారా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలకు నీరు అందిస్తామని, అదేవిధంగా చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు కెనాల్ ద్వారా సాగునీరు చేరేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏ గ్రామానికి ఎంత నీరు అవసరమో ప్రభుత్వం దగ్గర పూర్తి వివరాలు ఉన్నాయని, రైతులకు అన్నివిధాలా మద్దతు ఉంటుందని తెలిపారు.

**బీసీ రిజర్వేషన్లపై వ్యాఖ్య**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో చట్టం చేసిందని, కేంద్రం సహకరిస్తే విద్య, ఉద్యోగాల్లో పెద్ద ఎత్తున అవకాశాలు లభిస్తాయని మంత్రి గుర్తుచేశారు.


పచ్చదనం కార్యక్రమం

ఈ సందర్భంగా వీర్లగడ్డ తండా గ్రామపంచాయతీ ప్రాంగణంలో మొక్కలు నాటిన మంత్రి, స్థానికులతో కలిసి పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్థులు బస్సు సౌకర్యం, తాగునీటి సమస్యలను ప్రస్తావించగా, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ డైరెక్టర్ సురేష్ బాబు, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, భీమదేవరపల్లి తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఇతర శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# ''మిషన్ డాన్''..

(మొదటి పేజీ తరువాయి)

నిందితుడు వయసు కేవలం 16 సంవత్సరాలు. పదో తరగతి చదువుతున్నా, చోరీ కోసం పక్కా ప్లాన్ వేసుకున్నాడు. 80 వేలు దొంగిలించాలనుకున్నాడు. తన యాక్షన్ ప్లాన్‌ను ఇంగ్లీష్‌లో రాసుకున్నాడు. మృతురాలి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడ్డాడు. దేవుడి పటాల దగ్గర ఉన్న హుండీని పగులగొడుతుండగా, అమ్మాయి గమనించి తల్లిదండ్రులకు చెబుతానని హెచ్చరించింది. దీంతో భయపడ్డ బాలుడు తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. మెడ, పొట్టలో పదేపదే పొడవడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు పక్క బిల్డింగ్‌లో దాక్కున్నాడు. అయితే ఈ విషయం ఓ వ్యక్తి గమనించినా పెద్దగా పట్టించుకోలేదు. ఐదు రోజులపాటు కేసులో ఆధారాలు లభించక పోలీసులు తలమునకలయ్యారు. చివరికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇచ్చిన సమాచారం కేసుకు మలుపు తిప్పింది.




నిందితుడిని పట్టుకుని విచారించిన పోలీసులు మొదట ఎలాంటి సమాచారం రాబట్టలేకపోయారు. అతను బుకాయిస్తూ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. చివరికి ఇంట్లో వెతికినప్పుడు లేఖ, కత్తి, రక్తపు బట్టలు బయటపడ్డాయి. లేఖలో అతను చోరీ కోసం వేసుకున్న పథకం ఒక్కొక్కటి చదివితేనే వెన్నులో వణుకు పుట్టేలా ఉంది. ఇంట్లోకి ఎలా ప్రవేశించాలి, డబ్బులు ఎలా దొంగిలించాలి, బయటకు ఎలా రావాలి, చివరగా అనుమానం రాకుండా ఇంట్లో గ్యాస్ లీక్ చేసి ధ్వంసం చేయాలన్న ప్రణాళిక రాసుకున్నాడు. అంతా చూసిన పోలీసులు సైతం అవాక్కయ్యారు. పదహారేళ్లకన్నా తక్కువ వయసున్న బాలుడి చేతిలో ఇంత క్రూరత్వం దాగి ఉండటం సమాజాన్నే కలచివేసింది. చోరీ కోసం వేసుకున్న పథకం చివరికి అమాయక చిన్నారి ప్రాణం తీసిన తీరు భయానకంగా మారింది. 'మిషన్ డాన్' పేరుతో రాసుకున్న లేఖలోని లైన్లు నిందితుడి మనసులో దాగిన క్రూరత్వాన్ని స్పష్టంగా బయటపెట్టాయి.

# ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

జీహెచ్ఎంసీలో లైసెన్స్ తీసుకున్న కేబుళ్లు తప్ప ఏవీ ఉంచవద్దని తెలంగాణ అత్యున్నత ధర్మాసనం ఆదేశించింది. రామంతాపూర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపులో దురదృష్టవశాత్తు రథానికి కేబుల్ వైరు తగిలి ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది కేబుళ్లను ఎక్కడికక్కడ తొలగించారు. దీనిపై ఎయిర్‌టెల్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక మరోసారి విచారణ చేపట్టారు. ప్రజల ప్రాణాలకు బాధ్యులెవరని న్యాయమూర్తి పిటిషనర్లను ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటంపై జస్టిస్ నగేష్ భీమపాక తీవ్రవ్యాఖ్యలు చేశారు. రామంతాపూర్‌లో ఐదుగురు మరణించిన ఘటన గురించి న్యాయమూర్తి ప్రస్తావించారు. బర్త్‌డే రోజే తన తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడి ఘటనపై ఉద్వేగ భరిత వ్యాఖ్యలు చేశారు. కేకు కోయాల్సిన 9 ఏళ్ల బాలుడు తలకొరివి పెట్టడం కలిచివేసిందని జస్టిస్ నగేశ్ భీమపాక అన్నారు. విద్యుత్ ప్రమాదంపై ఎవరికి వారు చేతులు దులుపేసుకుంటే ఎలా అని సూటిగా ప్రశ్నించారు.

పసి హృదయం పగిలిపోయింది, అందరం బాధ్యులమేనని న్యాయమూర్తి అన్నారు. సమాజం సిగ్గుతో తలదించుకోవాలని, చలన




రహిత చట్టాలతో ప్రజల ప్రాణాలు ఎలా కాపాడగలమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైర్ల బరువుతో స్తంభాలు ఒరిగిపోతున్నాయన్న పిటిషనర్ల వాదనపై జస్టిస్ నగేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మామూళ్లతో కొందరు విద్యుత్ ఉద్యోగుల జేబులు బరువెక్కుతున్నాయని అన్నారు. ఒకరినొకరు నిందించుకోకుండా ఇలాంటివి పునరావృతం కానివ్వొద్దని సూచించారు.చట్టాలు కఠినంగా ఉంటే అమలు చేయలేం, సులభంగా ఉంటే ప్రజలు ఆచరించరని వ్యాఖ్యనించారు. స్తంభాలపై అన్ని వైర్లు నల్లగా ఉన్నందున గుర్తుపట్టలేకపోయామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కరెన్సీనోట్లపై ఉన్న గాంధీని మాత్రం బాగానే గుర్తుపడతారని జస్టిస్ నగేష్ భీమపాక అధికారులకు చురకలంటించారు.

రామంతాపూర్‌లోని గోకులేనగర్‌లో ఆదివారం (ఆగస్టు 17)న అర్ధరాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఘటనాస్థలిలోనే నలుగురు, ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ మరొకరు ప్రాణాలు విడిచారు. కృష్ణాష్టమి కారణంగా ఆదివారం నాడు రాత్రి ఊరేగింపు ఉత్సవాలు చేపట్టిన క్రమంలో రథాన్ని లాగుతున్న వాహనం మరమ్మతుకు గురికావడంతో దాన్ని పక్కన నిలిపివేసిన యువకులు, రథాన్ని చేతులతో లాగుతూ అలా ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో రథానికి పైన ఉన్న కరెంటు తీగలు తగిలాయి. దీంతో రథాన్ని లాగుతున్న తొమ్మిది మందికి విద్యుత్ షాక్ కొట్టడంతో వారంతా ఒక్కసారిగా విసిరేసినట్లు దూరంగా ఎక్కడికక్కడ పడిపోయారు. ఈ ఘటనతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన స్థానికులు వెంటనే ప్రాథమిక చికిత్స చేపట్టి దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నలుగురు మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతిచెందిన వారిలో కృష్ణయాదవ్ (21), సురేశ్ యాదవ్(34), రాజేంద్రరె డ్డి(45), శ్రీకాంత్ రెడ్డి(35), రుద్రవికాస్(39) ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనతో విద్యుత్ శాఖ మొత్తం ఉలిక్కిపడిరది. ఉన్నతాధికారులు భట్టి విక్రమార్కకు విషయం చెప్పగా ఆయన ఈ కేబుళ్లను తొలగించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో కేబుళ్లను తొలగించిన కొన్ని చోట్ల ఇంటర్‌నెట్ సౌకర్యం కూడా పోయింది. ఇంటి నుంచి పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సోషల్ మీడియాలో అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

# యూరియా కొరతతో రైతుల ఇబ్బందులు

- ఉదయం మూడు గంటల నుండి క్యూ లైన్ లో పడిగాపులు.
- ప్రభుత్వం యూరియా సరఫరా పెంచాలని రైతుల డిమాండ్.

హసన్ పర్తి, ఆగస్టు22( తెలంగాణ ముచ్చట్లు):




హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని యూరియా ఎరువుల కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది.గ్రామాల్లో సకాలంలో వర్షాలు పడుతున్నప్పటికీ యూరియా ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం ఎరువుల కోసం పొలం పనులు ఆపేసి ఎరువుల షాపుల వద్ద ఉదయం 3 గంటల నుండి క్యూ లైన్ లో నిలబడ్డప్పటికీ ఎరువులు అందకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారని రోజుల తరబడి డిపోలో చుట్టు తిరిగిన ఒక బస్తా దొరకడం లేదని పంట సాగు సీజన్ లో యూరియా లేకపోవడం వల్ల దిగుబడిపై ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో యూరియా సకాలంలో అందిందని కానీ ప్రస్తుత ప్రభుత్వంలో యూరియా కొరత అధికంగా ఉందని తక్షణమే ప్రభుత్వం స్పందించి పంట దిగుబడి పై ప్రభావం పడకుండా యూరియా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

### ప్రభుత్వం వెంటనే స్పందించాలి..



ఉదయం 3 గంటల నుండి క్యూ లైన్ లో నిలుచున్నప్పటికీ ఎరువులు దొరకడం లేదని అధికారులను అడిగితే స్టాక్ లేదని అంటున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

-ఎర్ర రాజు ఎల్లాపూర్ రైతు

### అవసరమైన యూరియా సరఫరా చేయాలి



గత ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి రాలేదని ఈ ప్రభుత్వంలో యూరియా కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని బ్లాక్ మార్కెట్ లో ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారని ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని అవసరమైన యూరియా సరఫరా చేయాలని కోరారు.

- తాళ్లపల్లి సదానందం జయగిరి రైతు

# గత అభివృద్ధి పనులు ప్రారంభం చేస్తూ ఆర్భాటాలు

- ముఖ్యమంత్రి ప్రకటించిన 1000 కోట్ల నిధుల జాడ ఎక్కడ?
- నందిమల్ల అశోక్, జిల్లా మీడియా కన్వీనర్

వనపర్తి,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):

గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సాధించిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఆర్భాటంగా ప్రారంభిస్తోందని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ ఘాటుగా విమర్శించారు. రెండు సంవత్సరాల పాలనలో కొత్తగా ఒక్క అభివృద్ధి పథకాన్ని కూడా చేపట్టలేకపోయారని ఆయన ఆరోపించారు. ప్రారంభం కానున్న హై లెవల్ బ్రిడ్జిలు, జి.పి భవనాలు వంటి ప్రాజెక్టులు గత ప్రభుత్వంలోనే మంజూరు చేయబడి కొన్నివరకు పూర్తి అయ్యాయని, మరికొన్ని ప్రారంభ దశలో ఉన్నాయని గుర్తుచేశారు. అధికారంలో ఉన్న వారు ప్రారంభించడం సహజమే అయినా, గతంలో మంజూరైన శంకుస్థాపన శిలాఫలకాలను అక్కడ ప్రతిష్ఠించి ప్రోటోకాల్ పాటించాలని అశోక్ సూచించారు.

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కృషితో పాలిటెక్నిక్ హాస్టల్ భవనం కోసం 22 కోట్లు,



జె.ఎన్.టి.యు కాలేజ్ కోసం 32 కోట్లు, ఐటీ టవర్ కోసం 22 కోట్లు మంజూరైనా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని ఆయన పేర్కొన్నారు. ఇదే విధంగా పానగల్లు, కోడేరు, వనపర్తి మండలాల రైతుల ప్రయోజనాల కోసం రామన్నగట్టు రిజర్వాయర్ నిర్మాణానికి 53 కోట్లు మంజూరైనా ప్రభుత్వం, నాయకులు నిర్మాణం ప్రారంభించకపోవడం రైతుల పట్ల కాంగ్రెస్ చిత్తశుద్ధిని బహిర్గతం చేస్తోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి హాజరైన 1000 కోట్ల రూపాయల అభివృద్ధి పనుల శంకుస్థాపనలు ఒక్కటి కూడా అమలు దిశగా సాగకపోవడం సిగ్గుచేటు విషయమని, ఆ శిలాఫలకాలు ఇప్పుడు దిష్టి బొమ్మలుగా మారిపోయాయని అశోక్ వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, జిల్లా మంత్రి కొత్త ప్రాజెక్టులు సాధ్యం కాకపోయినా, కనీసం గతంలో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించేలా చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు.





# వనపర్తి మండల గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక

- పలుస శ్రీనివాస్ గౌడ్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు

వనపర్తి,ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):

వనపర్తి జిల్లా కేంద్రంలో శుక్రవారం వనపర్తి మండల గౌడ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు పలుస శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా తిరుపతయ్య గౌడ్‌ను మండల అధ్యక్షుడిగా, కాటమోని శరత్ గౌడ్, ఖాసీం గౌడ్‌లను ఉపాధ్యక్షులుగా, అశోక్ గౌడ్‌ను ప్రధాన కార్యదర్శిగా, రవీందర్ గౌడ్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, కాట గౌని శ్రీనివాస్ గౌడ్‌ను కోశాధికారిగా ఎన్నుకున్నారు. అలాగే శ్రీనివాస్ గౌడ్, రాములు గౌడ్‌లను గౌరవాధ్యక్షులుగా, సూర్యం గౌడ్‌ను సలహాదారుగా నియమించారు. యూత్ విభాగంలో బాధ గౌని సురేష్ గౌడ్‌ను అధ్యక్షుడిగా, ఆర్. గంగాధర్ గౌడ్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన సభ్యులకు నియామక పత్రాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘ అధ్యక్షుడు పలుస శ్రీనివాస్ గౌడ్, జిల్లా గౌరవ సలహాదారులు నరసింహ గౌడ్, ఆంజనేయులు గౌడ్, ఉపాధ్యక్షులు సంగమేశ్వర గౌడ్, కృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పులిజాల బాలరాజు గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అక్కల నరేందర్ గౌడ్, జాయింట్ సెక్రెటరీలు తిలకేశ్వర్ గౌడ్, కొండ శ్రీనివాస్ గౌడ్, మీడియా కన్వీనర్ సారే పురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.అలాగే వనపర్తి పట్టణ గౌడ సంఘ అధ్యక్షుడు బత్తుల వినోద్ గౌడ్, మండల సభ్యులు తిరుపతయ్య గౌడ్, అశోక్ గౌడ్, రాములు గౌడ్, శరత్ గౌడ్, రవీందర్ గౌడ్, పానగల్ మండల సభ్యులు రాజవర్ధన్ గౌడ్, శరత్ గౌడ్, అకీ రమేష్ గౌడ్, గంగాధర్ గౌడ్, కాటమను శ్రీనివాస్ గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యలో రాణించి ఉన్నతంగా ఎదగాలి

హసన్ పర్తి,ఆగస్టు22( తెలంగాణ ముచ్చట్లు ):

హసన్ పర్తి మండలం జయ గిరి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జి.శ్రీధర్ ఆధ్వర్యంలో హెల్పింగ్ సొసైటీ ఫౌండేషన్ మరియు వెలమూరి ఫౌండేషన్ హైదరాబాద్ వారిచే ఉచితంగా ఒకటవ తరగతి నుండి 8వ తరగతి విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి సమాజ మార్గదర్శులని విద్యలో రాణించి ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లావణ్య పాల్గొని దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరి, అనిత,అనిల్,యాకయ్య, విష్ణుమూర్తి,శ్రీధర్,రమాదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# మృతుల కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం చేసిన కడియం శ్రీహరి

జఫర్గడ్ (ఆగస్టు 23) తెలంగాణ ముచ్చట్లు

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి శుక్రవారం పర్యటనలో భాగంగా జఫర్గడ్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. తీగారం గ్రామానికి చెందిన జిట్టబోయిన మల్లయ్య ఇటీవల మృతి చెందగా, ఆయన ఇంటికి వెళ్లి మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

తదుపరి తమ్మడపల్లి (జీ) గ్రామంలో ఎన్టీవీ రిపోర్టర్ కొత్త రంజిత్ తండ్రి కొత్త వెంకటేశ్వర్లు అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా, వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకొని, డాక్టర్లు సూచించిన విధంగా మందులు వేసుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అదే గ్రామానికి చెందిన వేల్పుల సోమ నర్సమ్మ, గాజుల సంపత్, సోన్నాయిల ఎల్లయ్య, పందిబోయిన సోమయ్య మరణించగా, వారి కుటుంబాలను కూడా పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని, కడియం శ్రీహరి సామాజిక సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

# సీపీఎం వేంసూరు కార్యదర్శిగా మల్లూరు చంద్రశేఖర్ ఏకగ్రీవ ఎన్నిక

సత్తుపల్లి, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):



ఖమ్మం జిల్లా వేంసూరు మండల కేంద్ర సీపీఎం శాఖ కార్యదర్శిగా సీపీఎం, సీఐటీయూ సీనియర్ నాయకుడు మల్లూరు చంద్రశేఖర్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక స్థానిక ఎర్రా రామయ్య భవనంలో జరిగింది.

ఎన్నిక అనంతరం మీడియాతో మాట్లాడిన మల్లూరు చంద్రశేఖర్ వేంసూరు మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అవసరమైతే ప్రజా పోరాటాలు నిర్వహిస్తానని తెలిపారు.

కొత్తగా ఎన్నికైన మల్లూరుకు పార్టీ సహచరులు, అభిమానులు, స్థానిక నేతలు అభినందనలు తెలిపారు

# భారత స్వాతంత్ర్యోద్యమం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కాప్రా, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు)

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో మౌలాలి ఎం.జే. కాలనీలోని కెనడి జేవియర్ హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించేందుకు భారత స్వాతంత్ర్యోద్యమం అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ నాయకురాలు శారద అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా విచ్చేసిన గుమ్మడి రోజా రాణి మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు జరిగాయి. భగత్ సింగ్ వంటి యోధులు ప్రాణాలు అర్పించగా, సుభాష్ చంద్రబోస్,




అల్లూరి సీతారామరాజు వంటి నాయకులు చేసిన త్యాగాల ఫలితంగా మనకు స్వాతంత్ర్యం లభించింది. ఈ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి గుమ్మడి హరి ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు మూఢ నమ్మకాల్లో కాకుండా శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి. సైంటిఫిక్ టెంపర్ ద్వారా మాత్రమే మనం సమాజాన్ని అభివృద్ధి దిశగా నడిపించగలము అని సూచించారు. స్కూల్ ప్రిన్సిపల్ వాణి విజేత విద్యార్థులను అభినందిస్తూ, ఇలాంటి పోటీలు విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తాయని పేర్కొన్నారు.

పోటీల విజేతలు:

8వ తరగతి:1వ బహుమతి - ఏ. లక్ష్మీ ప్రియా,2వ బహుమతి - డి. కుందన శ్రీ,3వ బహుమతి - జి.ఎల్.ఎస్.ఎస్. హర్షిని,

9వ తరగతి:1వ బహుమతి - జోబియా తర్విన్,2వ బహుమతి - శ్రేష్ఠ,3వ బహుమతి - ఎం. చెన్నకేశవ,10వ తరగతి:1వ బహుమతి - శ్రీ సాయి సుప్రీత్,2వ బహుమతి -శ్రీ సాయి కవిత,3వ బహుమతి - వంగూరి లెనార్డ్ సామ్యూల్,విజేతలకు గుమ్మడి హరిప్రసాద్, రోజా రాణి, ప్రిన్సిపల్ వాణి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి గీతాలు ఆలపించారు.



## దళిత సంఘాల రాష్ట్ర కమిటీ జిల్లా అధ్యక్షులుగా సానాది సాయిబాబా నియామకం

**కీసర, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ దళిత సంఘాల ఐకాస రాష్ట్ర కమిటీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులుగా సానాది సాయిబాబ నియామకం జరిగింది. శుక్రవారం రోజున హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బత్తుల చంద్రం చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షులు సానాది సాయిబాబ మాట్లాడుతూ, రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం దళిత సంఘాల ఐకాస చేపట్టబోయే ప్రతి కార్యక్రమంలో తన వంతు పాత్రను నిర్వర్తిస్తానని తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకై నిరంతర పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

అలాగే, 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు అయ్యే వరకు నిరంతర ఉద్యమం కొనసాగుతుందని, అంతిమంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో వెనుక బడిన వర్గాలకు పొందుపరిచి న హక్కుల సాధనకై తన పోరాటం ఆగదని చెప్పారు.తనను నమ్మి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించి నందుకు రాష్ట్ర అధ్యక్షులు బత్తుల చంద్రం కి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్, రాష్ట్ర యువజన విద్యార్థి సంఘం ఇంచార్జి వనం రమేష్, దళిత సంఘాల రాష్ట్ర నాయకులు బయ్యారం రాజన్న, తుమ్మ శ్రీనివాస్, చిప్పల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## సత్తుపల్లిలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు.!

**సత్తుపల్లి, ఆగస్టు 22(తెలంగాణ ముచ్చట్లు):** పద్మ భూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు సత్తుపల్లి నియోజకవర్గంలో ఉత్సాహంగా జరిగాయి. సత్తుపల్లి శాసనసభ సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని మెగాస్టార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

చిరంజీవి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణ బస్టాండ్ రింగ్ కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో మట్టా దంపతులు ప్రధాన అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేసి అభిమానులతో కలిసి ఆనందం పంచుకున్నారు. అనంతరం పట్టణంలో పాదచారులకు అన్నపానీయాలు అందజేస్తూ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిరంజీవి స్థాపించిన రక్తసేకరణ శిబిరం, కంటి దానం ఉద్యమం వంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శమని మట్టా దంపతులు ప్రశంసించారు. చిరంజీవి సమాజ హితాన్ని దృష్టిలో పెట్టుకొని చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలు ప్రజలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ వేడుకల్లో పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు దోమ ఆనంద్, మాజీ వైస్‌చైర్మన్ తోట సుజాల రాణి, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శివా వేణు, పాత్రికేయ సంఘ అధ్యక్షుడు తోట కిరణ్, మాజీ కౌన్సిలర్లు, కాపు సంఘం నాయకులు, చిరంజీవి అభిమానులు, మహిళా నాయకులు, యువ నాయకులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిధుల జమ

**పెద్దమందడి,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రంలో ఇందిరమ్మ హౌసింగ్ పథకం కింద లబ్ధిదారులైన ఆవుల సుజిత, మరియు తిర్లాపురం లక్ష్మమ్మ గార్లకు రాష్ట్ర ప్రభుత్వం నుండి మొదటి విడతగా నిధులు జమ అయ్యాయి.ఇళ్ల బేస్మెంట్ లెవల్ పూర్తి కావడంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో 1,00,000/ (ఒక లక్ష రూపాయలు) జమ చేయడం జరిగింది.ఈ సందర్భంగా లబ్ధిదారులు పేదలను గుర్తించి వారికి ఇల్లు మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మెగా రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి తహసిల్దార్ సరస్వతి, ఇన్చార్జ్ ఎంపీడీవో పుష్ప, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, టైలర్ రవి, రాఘవేందర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు తోటా కిరణ్ విజయపతాకం ఎగురవేసారు!

**సత్తుపల్లి, ఆగస్టు 22(తెలంగాణ ముచ్చట్లు):** కాకతీయ యూనివర్సిటీ లా ఫైనల్ ఇయర్ ఫలితాల్లో జర్నలిస్టు తోట కిరణ్ అద్భుత ఫలితాలను సాధించారు. ఫస్ట్ క్లాస్‌తో మెరిసిన ఆయన, చదువులోనూ ప్రతిభ చూపుతూ మరోసారి తన సామర్థ్యాన్ని చాటుకున్నారు. ప్రజలకు నిజాన్ని అందించే జర్నలిజం వృత్తిలో ఇప్పటికే గుర్తింపు పొందిన తోట కిరణ్, ఇప్పుడు న్యాయరంగంలో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. సామాజిక న్యాయం కోసం కలం పట్టిన ఆయన, ఇకపై చట్టం చేతిలోనూ సమాన న్యాయం కోసం పోరాడతారని సన్నిహితులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.



కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు ఆయన విజయాన్ని హర్షా తిరేకాలతో ఆహ్వానించారు. కష్టపడి సాధించిన ఈ విజయమే రాబోయే గొప్ప భవిష్యత్తుకు పునాది అని ప్రశంసించారు. జర్నలిజం, న్యాయరంగం రెండింటిలోనూ తోట కిరణ్ అగ్రగామిగా ఎదగాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

# వినాయక మండపాలకు పోలీసు శాఖ గట్టి హెచ్చరిక.!

**వేంసూరు, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు)** వినాయక చవితి వేడుకల సందర్భంగా మండపాల నిర్వహణలో నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను వేంసూరు మండలం సబ్ ఇన్స్పెక్టర్ కవిత స్పష్టంచేశారు. మండపాల నిర్మాణం, నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఎస్.ఐ. కవిత మీడియాతో మాట్లాడుతూ, మండపం ఏర్పాటు చేసుకునే ముందు పోలీసు శాఖ రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసి అనుమతి తీసుకోవాలి అని చెప్పారు. మండపం ప్రైవేటు భూమిలో ఏర్పాటు చేస్తే, సంబంధిత యజమాని నుండి అభ్యంతర రహిత ధృవీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.

విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు రాకుండా నాణ్యమైన తీగలు, పరికరాలు మాత్రమే వాడాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి మండపంలో రెయిన్ ప్రూఫ్ టెంట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం తప్పనిసరి అని తెలిపారు.

ప్రజా రవాణా, ఎమర్జెన్సీ వాహనాలకు ఇబ్బందులు కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలని, మండపాల వద్ద పశువులు, కోతులు, కుక్కలు రాకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రతి మండప కమిటీ వివరాలు, బాధ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు స్పష్టంగా ప్రదర్శించాలని అన్నారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలి. శోభాయాత్రల్లో డీజే వాడకూడదు అని కవిత స్పష్టం చేశారు. మండపాల్లో ఎల్లప్పుడూ ఒక వాలంటీర్ విధులు నిర్వర్తించేలా ఏర్పాట్లు చేయాలని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూలైన్లు, వాలంటీర్లు నియమించుకోవాలని సూచించారు.

మండపాల వద్ద వెలిగించే దీపాల విషయంలో తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని, అగ్ని ప్రమాదం సంభవించినా వెంటనే చర్యలు తీసుకునేలా రెండు బకెట్ల ఇసుక, నీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, అసభ్యకర నృత్యాలు, ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలు, పాటలు పూర్తిగా నిషేధమని చెప్పారు.

అలాగే పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు పాయింట్ బుక్లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని, అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, వదంతులను నమ్మరాదని హెచ్చరించిన ఎస్.ఐ. కవిత అన్ని మండప నిర్వాహకులు నిబంధనలు కచ్చితంగా పాటించాలి. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవు అని గట్టిగా స్పష్టం చేశారు.





# డిగ్రీ విద్యార్థులకు యూనిఫార్మ్‌లు, నోట్‌బుక్స్ పంపిణీ

**సత్తుపల్లి, ఆగస్టు 22(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని జెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఆశా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత యూనిఫార్మ్‌లు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. గోపి అధ్యక్షతన నిర్వహించారు.

ముఖ్య అతిథులుగా పాల్గొన్న సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాఘమయి, సిపిడిసి సభ్యులు డా. మట్టా దయానంద్ విజయకుమార్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు యూనిఫార్మ్‌లు, నోట్‌బుక్స్, ద్వితీయ మరియు తృతీయ సంవత్సరం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే డా. రాఘమయి మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలోనే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 2000 మంది జూనియర్, డిగ్రీ విద్యార్థులకు యూనిఫార్మ్‌లు, నోట్‌బుక్స్ ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చదువులో రాణించేందుకు ఎలాంటి సమస్య వచ్చినా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రతిభతో కళాశాల పేరు ప్రతిష్టలను మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

డా. దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ తాము చదువుకున్న రోజుల్లో ఎదుర్కొన్న ఇబ్బందులు ఈ తరం విద్యార్థులు ఎదుర్కోకూడదన్న ధ్యేయంతో విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని వివరించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ షేక్ పీర్ సాహెబ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**పెద్దమందడి,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి, రిటైర్డ్ టీచర్ కీ.శే. వెంకటరామ్ రెడ్డి గురువారం కన్నుమూశారు.

ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కొన్నరు శ్రీనివాస్ రెడ్డి, విటాచన్ రెడ్డి, జానకిరాముడు, విట్ట వెంకటేశ్వరరెడ్డి, కొమ్ము చెన్నయ్య, పానుగంటి సురేష్ తదితరులు మాజీ మంత్రితో పాటు పాల్గొన్నారు.




## వివిధ కొత్త పనులకు భూమి పూజ

**హసన్ పర్తి,ఆగస్టు22( తెలంగాణ ముచ్చట్లు):** హసన్ పర్తి మండలంలోని గ్రామపంచాయతీలలో గ్రామాల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర 2025 లో భాగంగా గ్రామసభలు నిర్వహించి పూర్తి అయిన పనుల ప్రారంభోత్సవం,క్యాటిల్ షెడ్, గోట్ షెడ్, కమ్యూనిటీ మ్యాజిక్ సోప్ ఫిట్, ఫలవనాలు వివిధ కొత్త పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిద్ధాపూర్, అరవపల్లి, గ్రామ పంచాయతీలలో క్యాటిల్ షెడ్ లకు భూమి పూజ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పూర్తి చేసుకున్న కూలీలను, దివ్యాంగ కూలీలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి,పి ఆర్ ఏఈ, ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ, మిషన్ భగీరథ ఏఈ, అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనపూర్ మండల ఆగారం గ్రామంలో పనుల జాతర ప్రారంభం


**ఘనపూర్,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):** ఘనపూర్ మండలంలోని ఆగారం గ్రామంలో పనుల జాతర కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకుడు మున్నూరు జయకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన గ్రామంలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులతో పాటు ఇకముందు చేపట్టబోయే పనులపై అధికారులతో చర్చించి, వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం గ్రామంలోని నీటి కుంట నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.తరువాత గ్రామ సమస్యలపై నాయకులు, అధికారులతో సమావేశమై పరిష్కార మార్గాలు సూచించారు. కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికుడిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ కార్యదర్శి రవి కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ మంజుల, కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్య, నరేష్, వెంకట్రెడ్డి, జైపాల్, శేషయ్య, మహేష్, చంద్రకాంత్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీజ ఎంపిక

**కొమురం భీం,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):** కొమురం భీం జిల్లా గోలేటి టౌన్షిప్ వేదికగా జరగనున్న 71వ సీనియర్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ మహిళల ఛాంపియన్‌షిప్ కు జాగృతి ఉమెన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థిని మ్యాదరబోయిన శ్రీజ ఎంపికయ్యారు. బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రీజ రాష్ట్రస్థాయిలో పాల్గొనే అర్హత సాధించడం కళాశాల వర్గాల్లో ఆనందం నింపింది.

ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎల్ది మహేందర్, డైరెక్టర్స్ ఎల్ది రవీందర్, దావు శ్రీనివాస్ రెడ్డి, ఏ. సునీల్, ఎల్ది రాజు, ప్రిన్సిపాల్ ఎల్. ఉమాపతిరావు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ల కుమారస్వామి, లెక్చరర్లు ఏ. చిరంజీవి, చిట్యాల నరేష్, హెచ్. శ్రీకాంత్, జి. వీరాచారి, ఎ. కృష్ణ, మంజుల ఆమె విజయంపై హర్షం వ్యక్తం చేశారు.వారు మాట్లాడుతూ శ్రీజ కృషి, క్రీడాస్ఫూర్తి రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.



# ప్రజా సమస్యలపై సెక్రటేరియట్ ముట్టడించిన కార్పొరేటర్ శ్రవణ్

**మల్కాజ్గిరి, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు)**



నగరంలో పెరుగుతున్న ప్రజా సమస్యలపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబడుతూ మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు సెక్రటేరియట్ ముట్టడించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన సేవ్ హైదరాబాద్ కార్యక్రమంలో ఈ ఆందోళన జరిగింది.ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు

**శ్రవణ్ మాట్లాడుతూ –**

వర్షం పడితే ప్రతి కాలనీ చెరువుల్లా మారిపోతుందని, వీధుల్లో నీరు నిల్వ ఉండడం వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.కాలువలు మూసుకుపోవడం, డ్రైనేజీలు సరిగా లేకపోవడం వల్ల దుర్వాసనతోపాటు ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు తరచుగా జరుగుతున్నప్పటికీ, బాధ్యులైన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.

**విభాగాలపై విమర్శలు**

హైడ్రా, జిహెచ్ఎంసి, విద్యుత్ శాఖ, వాటర్ వర్క్స్ వంటి విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల సమస్యలు మరింత పెరుగుతున్నాయని శ్రవణ్ ఆరోపించారు. నగరంలో కొత్త భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంలో, రక్షిత మంచినీరు సరఫరా చేయడంలో వాటర్ వర్క్స్ పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సాధారణ ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.



**భవిష్యత్ ఉద్యమ హెచ్చరిక:**

ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే -వాటర్ బోర్డు,విద్యుత్ బోర్డు, జిహెచ్ఎంసి కార్యాలయాలను కూడా ముట్టడించడానికి వెనుకాడబోమని శ్రవణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందు యాదవ్, మురళి గౌడ్, నాని, చెన్నా రెడ్డి, సంజీవ్, శ్రీనివాస్, వివేక్, షాగంటి శ్రీనాథ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# హనుమకొండలో అంగరంగ వైభవంగా తీజ్ ఉత్సవాలు

**హన్మకొండ,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం బాలాజీ బంజారా కాలనీలో తీజ్ ఉత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ లావుడియా రవి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బంజారా కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. ప్రతి సంవత్సరం 1500కు పైగా కుటుంబాల సమక్షంలో జరిగే ఈ పండుగలో సేవాలాల్ ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్, సీనియర్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బానోత్ కల్పన సింగ్ లాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, గుండ్ల సింగారంలో తీజ్ ఉత్సవాలను ఇంత పెద్ద ఎత్తున నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. బంజారా భవన్ నిర్మాణానికి వారం రోజుల్లో శంకుస్థాపన చేస్తానని, అలాగే తీజ్ పండుగకు గవర్నమెంట్ హాలిడే ప్రకటించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఉత్సవాల్లో తీజ్ బుట్టల నిమజ్జనం అంగరంగ వైభవంగా జరగగా, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేదిక కళకళలాడింది. స్థానిక ప్రజలు, మహిళలు, యువత, కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామ పెద్దలు, మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# "స్టేషన్ కాంగ్రెస్" లో సీనియర్ల ఆవేదన

- మంత్రి సురేఖని కలిసిన స్టేషన్ ఘనపూర్ నాయకులు
- స్టేషన్ ఘనపూర్,

**ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):**

పార్టీ పునాది బలపడే క్రమంలో కష్టాలు మన్నించి, త్యాగం చేసిన సీనియర్లను విస్మరించి, కొత్తగా చేరిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం తగదని స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బహిరంగంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం వారు దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి తమ సమస్యలను వివరించి మెమోరాండం సమర్పించారు.

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ల ఆవేదన**

సీనియర్ నాయకులు పలువురు మాట్లాడుతూ..గత పదేళ్లుగా కష్టకాలంలో పార్టీ కోసం తాము శ్రమించామని, కార్యకర్తలను కాపాడామని, కష్టసుఖాల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేసామని గుర్తుచేశారు. అయినప్పటికీ ఇటీవల పార్టీలో చేరిన వారికి మాత్రమే పదవులు, కమిటీ స్థానాలు, సమావేశాల సమాచారం లభిస్తుండటమే కాకుండా, కీలక నిర్ణయాల్లో వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం పాత కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తోందని, పార్టీ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

**రాబోయే ఎన్నికల్లో గుర్తింపు కావాలి**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు సముచిత గౌరవం ఇవ్వాలని, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో పాత కాంగ్రెస్ కార్యకర్తలకు అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. "ఇన్నాళ్లు పార్టీ బలహీన స్థితిలో ఉన్నప్పుడు మేమే కాపాడాం, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మమ్మల్ని పక్కన పెట్టడం అన్యాయం" అని వారు స్పష్టం చేశారు.



**అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానన్న మంత్రి**

వారి సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి కొండా సురేఖ, "మీ ఆవేదనలను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ ఇన్‌చార్జ్ నటరాజన్ దృష్టికి తప్పనిసరిగా తీసుకెళ్తాను. పార్టీ లోపల సీనియర్లకు తగిన గౌరవం లభించేలా కృషి చేస్తాను" అని హామీ ఇచ్చారు.

**రాజకీయ సమీకరణలపై చర్చ**

స్థానిక కాంగ్రెస్ నాయకుల ఈ ఆవేదన పార్టీ అంతర్గత పరిస్థితులను స్పష్టంగా తెలియజేస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త వర్గాలకు ప్రాధాన్యం పెరగడం, పాత కార్యకర్తలు పక్కన పడిపోవడం వంటి అంశాలు చాలాచోట్ల ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. స్టేషన్ ఘనపూర్‌లో ఈ పరిణామాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ వ్యూహంపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డబుల్ బెడ్‌రూమ్‌లో మహిళలు ఆరు గ్యారెంటీల అమలు చేయాలని సీఐటీయూ

**నాగారం, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు)**

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మహిళలతో సమావేశం సీఐటీయూ కీసర మండల నాయకులు బంగారు నర్సింగరావు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మహిళలకు వాగ్దానం చేసిన నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే సరఫరా చేయడం, అలాగే డబుల్ బెడ్‌రూమ్ గృహ లబ్ధిదారులందరికీ జీరో కరెంట్ బిల్లు పథకం అమలు చేయాలని కోరారు.

అదేవిధంగా, మహిళల కోసం స్వశక్తి, స్వయం ఉపాధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వారికి సబ్సిడీ రుణాలు అందజేయాలని అన్నారు. డ్వాక్రా మహిళా పొదుపు సంఘాల పునరుద్ధరణకు సంబంధిత మున్సిపల్ అధికారులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగా మహిళా పొదుపు గ్రూపులను కూడా ఏర్పాటు చేయాలని నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం ఈ నెల 25వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ ధర్నాలో మహిళలంతా, ముఖ్యంగా డబుల్ బెడ్‌రూమ్ గృహ లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రాంతీయ మహిళలు విజయలక్ష్మి, యాదమ్మ, సాహిన, రుక్సానా, శకుంతల, సైదమ్మ, వర్ష తదితరులు పాల్గొన్నారు.

# కరుణాపురంలో ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

**చిల్పూర్,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):**



జనగామ జిల్లా చిల్పూర్ మండలంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆరూరి రాజు నేతృత్వం వహించగా, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆరూరి రాజు మాట్లాడుతూ, "చిరంజీవి తెలుగు సినీ రంగానికి అపారమైన సేవలు అందించారు. 'చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్' ద్వారా లక్షలాది మంది కంటి వెలుగులు పొందారు. ఆయనలాంటి మహానటుడు, మానవతావాది పుట్టిన రోజు ప్రతి అభిమానికి పండుగే. ఆయన ఆశీస్సులతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ సమాజానికి మేలుచేయాలి" అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మట్యాడ స్వామి, చింత రాజు, మునిగాల శ్రీకాంత్, కుక్కల మోహన్,మాట్యాడ రాజు, కుర్సపల్లి చంద్రయ్య మైసూర్ నరేష్ స్థానిక అభిమానులు, స్నేహితులు, గ్రామ పెద్దలు పాల్గొని కేక్ కట్ చేసి ఆనందంగా వేడుకలను జరుపుకున్నారు.





# ఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధి జాతర

**వనపర్తిలో రూ.23.22 కోట్ల పనుల శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే**

**వనపర్తి,ఆగస్టు22 (తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి శుక్రవారం నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటించి ఒకే రోజు రూ.23 కోట్ల 22 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ప్రారంభోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తాను పదవీ బాధ్యతలు చేపట్టిన 18 నెలల వ్యవధిలో మొత్తం రూ.1,759 కోట్ల అభివృద్ధి పనులు వనపర్తి నియోజకవర్గంలో ప్రారంభించామని తెలిపారు.

ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన పనుల్లో అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, హై లెవెల్ బ్రిడ్జిలు, హెల్త్ సెంటర్లు, పాఠశాల భవనాలు ప్రధానమని వివరించారు.

గత పదేళ్లలో బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పేపర్లకే పరిమితమైందని, ప్రస్తుతం ఇందిరమ్మ రాజ్యంలో గ్రామ గ్రామాన అభివృద్ధి జాతర కొనసాగుతోందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రేషన్ కార్డుల మంజూరు, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్తు, మహిళలకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాల వలన గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొన్నదని తెలిపారు.అలాగే రానున్న రోజుల్లో వనపర్తి నియోజకవర్గాన్ని విద్య, క్రీడలు, వైద్యం, మహిళా స్వయం ఉపాధి తదితర రంగాల్లో మరింత అభివృద్ధి చేయాలని కృతనిశ్చయంతో పనిచేస్తానని చెప్పారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఖిల్లా గణపురం, వనపర్తి మండలం, వనపర్తి పట్టణం, గోపాల్పేట, రేవల్లి, గేదెల మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.కార్యక్రమాల్లో ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# గోల్డెన్ మటన్ & చికెన్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**చిలకనగర్, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు):**

చిలకనగర్ డివిజన్ లో ప్రశాంత్ నగర్ రిలయన్స్ మార్ట్ పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన గోల్డెన్ మటన్ & చికెన్ సెంటర్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, యువత ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి కోసం వ్యాపార రంగంలోకి అడుగుపెట్టడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు సరసమైన ధరల్లో నాణ్యమైన మటన్, చికెన్ అందించడంతో పాటు వ్యాపారం అభివృద్ధి చెంది స్థానికులకు ఉపాధి అవకాశాలు కలగాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో చిలకనగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, బిఆర్ఎస్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాలకృష్ణ గౌడ్, బజార్ జగన్నాథ్ గౌడ్, రామాంజనేయులు, శ్యామ్, ఎండి అసద్, మార్క శీను, ఫారూఖ్, ఉబేద్, రాకేష్, తిరుపతి సాయికిరణ్ ప్రవీణ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడిలో పనుల జాతర

**పెద్దమందడి,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం-2025లో భాగంగా పెద్దమందడి మండల పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం పలు గ్రామాల్లో పనుల జాతర కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

మండలంలోని 22 గ్రామాల్లో పూర్తైన పనులకు ప్రారంభోత్సవాలు, కొత్త పనులకు భూమి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామసభల్లో ప్రజలకు చేపట్టబోయే పనుల వివరాలను అధికారులు తెలియజేశారు.చేపట్టబోయే 10 ముఖ్య పనులు పశువుల షెడ్లు,గొర్ల షెడ్లు,కోళ్ల షెడ్లు,అజోలా పెంపకం,వానపాముల ఎరువుల యూనిట్లు తో పాటు మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.



సన్మానాలు, మంజూరు పత్రాలు గ్రామ సభల్లో ఉపాధి హామీ పథకంలో ఎక్కువ పని దినాలు చేసిన కూలీలను, గ్రామ పంచాయతీ వర్కర్లను సన్మానించారు. అలాగే ఇప్పటికే మంజూరైన పనుల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు.రూ.11.60 లక్షల విలువైన పనులు ఈ జాతరలో భాగంగా మొత్తం 11,60,584 విలువైన కొత్త పనులకు భూమిపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, సెక్రటరీలు, ఉపాధి హామీ ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

**కీసర, ఆగస్టు 22 (తెలంగాణ ముచ్చట్లు)**


రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు, కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాల నిరోధక చర్యలు మరియు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం 12 నుండి 1 గంటల వరకు ఎం.జె.పి.టి.బి.సి. డబ్ల్యూ. ఆర్.ఇ.ఐ.ఎస్ బాలుర వసతి గృహం, బోగారం లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. అంజనేయులు, సెక్టార్ ఎస్ఐ డి. వెంకటేష్, అలాగే పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సుమారు 200 మంది విద్యార్థులు హాజరైన ఈ సమావేశంలో, ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పద్ధతులు, వాటి ప్రభావం, నివారణ చర్యలు, జాగ్రత్తలు గురించి విద్యార్థులకు వివరించారు. యువత సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, ఫ్రాడ్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# మైక్రోసాఫ్ట్ కార్యాలయంలో గాజా దాడుల నిరసనలు..




అమెరికాలోని వాషింగ్టన్‌లోని మైక్రోసాఫ్ట్ రెడ్‌మండ్ కార్యాలయంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ ఉద్యోగులు రెండు రోజులుగా నిరసనలు చేపట్టారు. మైక్రోసాఫ్ట్ అభివృద్ధి చేసిన సాంకేతికతను ఇజ్రాయెల్ సైన్యం దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ, సుమారు 35 మంది ఉద్యోగులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ నిరసనలు కంపెనీ యొక్క బాధ్యతాయుతమైన సాంకేతిక వినియోగం గురించి ప్రశ్నలను లేవనెత్తాయి, అలాగే కార్పొరేట్ నీతి మరియు రాజకీయ సమస్యలపై ఉద్యోగుల ఆందోళనలను హైలైట్ చేశాయి.నిరసనకారులు తమ డిమాండ్లను వ్యక్తం చేయడానికి ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడం, రంగులు చల్లడం వంటి చర్యలకు పాల్పడ్డారు, దీనితో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మైక్రోసాఫ్ట్ యాజమాన్యం ఈ చర్యలను అసమ్మతిగా భావించినప్పటికీ, నిరసనకారులు తమ సాంకేతికత యుద్ధంలో వినియోగించబడుతున్న తీరుపై నైతిక ఆందోళనలను వ్యక్తం చేశారు. ఈ ఘటన సాంకేతిక కంపెనీలు తమ ఉత్పత్తుల వినియోగంపై ఎలాంటి నియంత్రణ కలిగి ఉండాలనే చర్చను మరింత తీవ్రతరం చేసింది.పరిస్థితి అదుపు తప్పడంతో స్థానిక పోలీసులు జోక్యం చేసుకొని 18 మంది నిరసనకారులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మైక్రోసాఫ్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు మాజీ ఉద్యోగులు కూడా ఉన్నారు. ఈ అరెస్టులు నిరసనకారుల ఉద్దేశాలను దెబ్బతీసినప్పటికీ, వారు తమ డిమాండ్లను మరింత గట్టిగా వినిపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటన సామాజిక మరియు రాజకీయ సమస్యలపై కార్పొరేట్ ప్రపంచంలో జరుగుతున్న ఉద్యమాలకు ఒక ఉదాహరణగా నిలిచింది. ఈ నిరసనలు మైక్రోసాఫ్ట్‌తో పాటు ఇతర సాంకేతిక దిగ్గజాలను తమ ఉత్పత్తుల వినియోగం గురించి ఆలోచింపజేస్తున్నాయి. గాజా దాడులపై నిరసనలు కేవలం రాజకీయ వ్యక్తీకరణలకు మాత్రమే పరిమితం కాకుండా, సాంకేతికత యొక్క నైతిక బాధ్యతలపై విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. ఈ ఘటన భవిష్యత్తులో కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగుల ఆందోళనలను ఎలా నిర్వహిస్తాయి, సాంకేతికత యొక్క రాజకీయ పరిణామాలను ఎలా ఎదుర్కొంటాయి అనే అంశాలపై కీలక ప్రభావం చూపనుంది.

# దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా లాభాల బాటలో



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు కూడా లాభాల బాటలో పయనించాయి. జీఎస్టీలో ప్రతిపాదించిన కీలక సంస్కరణలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరచడంతో గురువారం సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి.ట్రేడిరగ్ సెషన్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో కదలాడినప్పటికీ, చివరికి లాభాలను నిలబెట్టుకున్నాయి.ట్రేడిరగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 142.97 పాయింట్ల లాభంతో 82,000.71 వద్ద స్థిరపడిరది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 33.20 పాయింట్లు పెరిగి 25,083.75 వద్ద ముగిసింది. అయితే, ఆటో, ఎఫ్ఎంసీజీ వంటి రంగాలలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్లపై కొంత ఒత్తిడి కనిపించింది.ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల జీఎస్టీ విధానాన్ని రద్దు చేసి, దాని స్థానంలో 5%, 18% చొప్పున రెండు శ్లాబుల విధానాన్ని తీసుకురావాలన్న ప్రతిపాదనకు మంత్రుల బృందం ఆమోదం తెలపడం మార్కెట్లకు సానుకూల శక్తినిచ్చింది. ''స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ ప్రకటించిన నూతన తరం జీఎస్టీ సంస్కరణల అమలులో ఇది ఒక కీలకమైన తొలి అడుగు'' అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా విశ్లేషించారు. దీనికి తోడు, ఆగస్టులో తయారీ, సేవా రంగాలు బలమైన వృద్ధిని కనబరచడం కూడా మార్కెట్‌కు స్థిరత్వాన్ని ఇచ్చిందని ఆయన తెలిపారు.సెన్సెక్స్ షేర్లలో బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఎల్%డ%టీ, సన్ ఫార్మా, టైటాన్ ప్రధానంగా లాభపడగా, పవర్‌గ్రిడ్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకింగ్ సూచీలు లాభాల్లో ముగియగా, ఆటో, ఎఫ్ఎంసీజీ సూచీలు నష్టాల్లో ముగిశాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 87.22 వద్ద బలహీనంగా ట్రేడ్ అయింది.

# జీఎస్టీ పై సామాన్యులకు గుడ్ న్యూస్




సామాన్యులకు గుడ్ న్యూస్.. ఇప్పటివరకు ఉన్న నాలుగు జీఎస్టీ స్లాబ్‌లను కేవలం రెండు ప్రామాణిక రేట్లకు తగ్గించాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు మంత్రుల బృందం అంగీకారం తెలిపింది. ప్రస్తుతం జీఎస్టీ రేట్లు 5%, 12%, 18%, 28% స్లాబ్‌లుగా ఉన్నాయి. వీటి స్థానంలో 12%, 28% రేట్లను రద్దు చేసి, కేవలం 5%, 18% స్లాబ్‌లను మాత్రమే కొనసాగించాలని ఈ బృందం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ప్రకటించారు. ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర ప్రతిపాదనకు Gూవీ ఆమోదం లభించింది. కేంద్ర ఆర్థిక శాఖ ప్రకారం, రేట్ల హేతుబద్ధీకరణ వల్ల పరోక్ష పన్ను వ్యవస్థ మరింత సులభతరం కానుందని తెలిపింది. గృహాలు, రైతులు, మధ్యతరగతి వర్గం, మీవీజు లకు ఉపశమనం కలుగుతుందని కేంద్రం పేర్కొంది. అలాగే పారదర్శకత పెరగడమే కాకుండా, వృద్ధి ఆధారిత పాలనకు ఇది దోహదం చేస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా స్పష్టం చేశారు. ప్రస్తుతం 12% స్లాబ్ కింద ఉన్న 99% వస్తువులు అన్నీ 5% స్లాబ్‌కు బదిలీ చేస్తారు. అలాగే 28% స్లాబ్ కింద ఉన్న 90% వస్తువులు 18% స్లాబ్‌లో పరిధిలోకి వస్తాయి. మిగిలిన 57 శాతం వస్తువులు, అంటే హానికర వస్తువులు (సిగరెట్లు, టొబాకో, లగ్జరీ వస్తువులు మొదలైనవి)పై ప్రత్యేకంగా 40% వరకు అధిక పన్ను విధించే అవకాశం ఉంది. జీఎస్‌టీలో ఆరుగురు సభ్యులు ఎవరంటే.. బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి (అధ్యక్షుడు) ఉత్తరప్రదేశ్ ఆర్థిక మంత్రి సురేష్ కుమార్ ఖన్నా రాజస్థాన్ ఆరోగ్య మంత్రి గజేంద్ర సింగ్ పశ్చిమ బెంగాల్ ఆర్థిక మంత్రి చంద్రిమా భట్టాచార్య కర్ణాటక రెవెన్యూ మంత్రి కృష్ణ బైరే గౌడ కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్. బాలగోపాల్ బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో మరో కీలక అంశంపై కూడా చర్చ జరిగింది.

# ప్రముఖ పారిశ్రామికవేత్త మృతి



భారత సంతతికి చెందిన ప్రముఖ బ్రిటీష్ పారిశ్రామికవేత్త లార్డ్ స్వరాజ్ పాల్ లండన్‌లో 94 ఏళ్ల వయసులో మరణించారు. వయో సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆయన గత కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం (స్థానిక కాలమానం ప్రకారం) లార్డ్ తుదిశ్వాస విడిచారు. యూకేలో కాపారో గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌ను స్థాపించిన లార్డ్ అరుదైన భారత్‌లో జన్మించిన బ్రిటీష్ ఇండస్ట్రియలిస్ట్, ఫిలాన్త్రోపిస్ట్‌గా గుర్తింపు పొందారు. పంజాబ్‌లోని జాలంధర్‌లో 1931 ఫిబ్రవరి 18న లార్డ్ స్వరాజ్ పాల్ జన్మించారు. పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీఎస్సీ పట్టా పొందారు. అమెరికాలోని మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. అనంతరం తన తండ్రి స్థాపించిన కుటుంబ వ్యాపార సంస్థ అపీజే గ్రూప్‌లో పనిచేసేందుకు భారత్‌కు తిరిగి వచ్చారు. అయితే తన కుమార్తె అంబికా చికిత్స కోసం 1966లో యూకేకి వెళ్లారు. ఆమె మరుసటి ఏడాది లుకేమియాతో మరణించింది. అనంతరం 1968లో యూకేలో కాపారో గ్రూప్ స్థాపించి అక్కడే స్థిరపడిపోయారు. లార్డ్ కాపారో గ్రూప్‌ను స్టీల్, ఇంజనీరింగ్ రంగాలలో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్‌గా విస్తరింపజేశారు. అలాగే, 1975లో బ్రిటన్, భారత్ మధ్య మెరుగైన సంబంధాల కోసం ఇండో‌బ్రిటిష్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. వ్యాపార రంగంలోనే కాకుండా లార్డ్ రాజకీయాల్లో మంచి గుర్తింపు సాధించారు. 1996లో లైఫ్ పీర్‌గా నియమితులైన లార్డ్ పాల్.. హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో వాణిజ్యం, విద్య, ఉద్యోగవకాశాల కమిటీలలో చురుకుగా పాల్గొన్నారు. ఆ తర్వాత డిప్యూటీ స్పీకర్‌గా, 2009లో ప్రైవీ కౌన్సిలర్‌గా నియమితులయ్యారు. లండన్ జూను మూసివేత నుంచి కాపాడడంలో, పిల్లల విభాగం, ఇతర కార్యక్రమాలకు మద్దతు ఇచ్చారు. అలాగే, తన కుమార్తె అంబికా జ్ఞాపకార్థం అంబికా పాల్ ఫౌండేషన్ స్థాపించి, విద్య, ఆరోగ్య రంగాల్లో అనేక సహాయ కార్యక్రమాలను నిర్వహించారు. లార్డ్ పాల్ బ్రిటన్‌లోని ధనవంతులైన ఆసియన్‌లలో ఒకరిగా ఎదిగి, దశాబ్దాల పాటు వ్యాపారం, రాజకీయాలు, పరోపకారంలో ప్రముఖ వ్యక్తిగా నిలిచారు.

# స్కామ్ అకౌంట్లను గుర్తించడానికి బ్యాంకుల్లో ఏఐ ఆధారిత వ్యవస్థ




ఆన్‌లైన్ మోసాలు, మనీలాండరింగ్‌ను అరికట్టడానికి అన్ని బ్యాంకులలో ఖాతాలలో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ధృవీకరణను తప్పనిసరి చేయాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) నిర్ణయించింది. ఈ మేరకు ఆర్‌బీఐ త్వరలో మార్గదర్శకాలను జారీ చేయనుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మొదట స్కామ్ ఖాతాలను గుర్తించి వాటిని బ్లాక్ చేయడానికి ఆర్‌బీఐ ఓ బ్యాంకులో ఏఐ ఆధారిత వ్యవస్థను ఉపయోగించి పైలట్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సమయంలో సదరు ప్రభుత్వ రంగ బ్యాంకులో మాత్రమే 13 లక్షల ఖాతాలను గుర్తించి బ్లాక్ చేశారు. మార్గదర్శకాలు అమల్లోకి వచ్చిన తర్వాత, ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులతో సహా అన్ని బ్యాంకులు మ్యూల్ ఖాతాలను గుర్తించి బ్లాక్ చేయాల్సి ఉంటుంది. తద్వారా ఏ రకమైన అక్రమ బదిలీనైనా అరికట్టవచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సైబర్ మోసగాళ్లు సామాన్యులను లక్ష్యంగా చేసుకోకుండా ఉండటానికి ఈ వ్యవస్థ ఎలాంటి టూవే లావాదేవీనైనా గుర్తించగలదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా బ్యాంకింగ్ లైసెన్స్‌లు, వాటి పునరుద్ధరణ దీని పరిధిలోకి వస్తాయని తెలుస్తోంది. ఈ నిబంధనలను పాటించేందుకు ప్రభుత్వం దేశవ్యాప్తంగా భారీ ప్రచారాన్ని కూడా నిర్వహించాలని భావిస్తున్నట్టు సమాచారం.

# శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ ఐపీఓకు భారీ స్పందన




జామ్‌నగర్‌కు చెందిన శ్రీజీ గ్రూప్‌కు అనుబంధ సంస్థ శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ లిమిటెడ్ ఐపీఓకు భారీ స్పందన వచ్చింది. రూ.410.71 కోట్ల విలువైన ఈ పబ్లిక్ ఆఫరింగ్ ఆగస్టు 19న ప్రారంభమై ఆగస్టు 21న ముగిసింది. ఈ ఇష్యూ పూర్తిగా ఫ్రెష్ ఇష్యూ రూపంలో ఉండగా, ఒక్కో షేరు ధరను రూ.240 నుంచి రూ.242 మధ్యగా నిర్ణయించారు. లాట్ సైజ్ 58 షేర్లుగా ఉండటంతో, ఒక రిటైల్ ఇన్వెస్టర్ కనీసం రూ.14,616 పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం, 1.14 కోట్ల షేర్లకుగాను 21.17 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో మొత్తం సబ్‌స్క్రిప్షన్ 18.56 రెట్లు నమోదైంది. విభాగాలవారీగా చూస్తే, నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు 38.96 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్లు 14.73 రెట్లు, క్వాలిఫైడ్ ఇన్వెస్టర్లు 9.97 రెట్లు సబ్‌స్క్రైబ్ చేశారు. షేర్ల కేటాయింపు ఆగస్టు 22న జరగనుండగా, లిస్టింగ్ ఆగస్టు 26న బీఎస్ఈ, ఎన్ఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో జరుగనుంది. శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ లిమిటెడ్ భారత్, శ్రీలంకలోని 20 ఓడరేవుల్లో డ్రై బల్క్ కార్గో (పొడి సరుకులు) రవాణా, లాజిస్టిక్స్ సేవలు అందిస్తోంది. ప్రస్తుతం సంస్థకు 80కి పైగా వెసెల్స్ (టగ్‌బోట్లు, బార్జ్‌లు, ఫ్లోటింగ్ క్రేన్‌లు), అలాగే 370కి పైగా వాణిజ్య వాహనాలు, ఎర్త్‌మూవింగ్ మెషినరీ ఉన్నాయి. ఐపీఓ ద్వారా వచ్చిన నిధులను కొత్త షిప్‌లు కొనుగోలు చేయడానికి, అలాగే కొన్ని ఋణాల భారం తగ్గించేందుకు వినియోగించనున్నట్లు కంపెనీ ప్రకటించింది.

## ఏకంగా 10,000mAh భారీ బ్యాటరీ ఫోన్ వచ్చేస్తోంది..




ప్రముఖ స్మార్ట్ ఫోన్ మేకర్ రియల్‌మీ తన రాబోయే స్మార్ట్‌ఫోన్ లాంచ్ తేదీని టీజ్ చేసింది. బ్యాటరీ విషయంలో ఇది "పెద్ద" డీల్ అంటూ ఊరిస్తోంది. దీని పేరును ఇంకా వెల్లడించనప్పటికీ, కొత్త రియల్‌మీ డివైస్ 10,000 ఎంఏహెచ్ భారీ బ్యాటరీని కలిగి ఉంటుందని కంపెనీ ఎక్స్ (గతంలో ట్విట్టర్) లో ఒక పోస్ట్‌లో టీజ్ చేసింది. "ఇంత పెద్దది సరిపోతుందా? ఇదిగో రియల్‌మీ 1x000mAh - మరోసారి పరిమితులను చెరిపేస్తుంది. ఆగస్టు 27న అద్భుతం చూడండి' అంటూ రియల్‌మీ పోస్ట్ చేసింది. "అతిపెద్దది మరింత పెద్దదిగా మారింది. రియల్‌మీ మరోసారి పరిమితులను పునర్నిర్వచించనుంది. 320వాట్ ఫాస్ట్ ఛార్జింగ్ నుంచి 10,000 ఎంఏహెచ్ భారీ బ్యాటరీ వరకు... తర్వాత ఏం జరగబోతోంది?" అని మరో ఎక్స్ పోస్ట్ లో పేర్కొంది. అంటే ఈ స్మార్ట్ ఫోన్ లో అధునాతన బ్యాటరీ, ఛార్జింగ్ టెక్నాలజీ ఉండొచ్చని తెలుస్తోంది. రియల్‌మీ రాబోయే డివైజ్ 10,000 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యాన్ని దాటుతుందా అని చాలా మంది ఆలోచిస్తున్నారు. ప్రస్తుతం రియల్‌మీలో అత్యంత శక్తివంతమైన బ్యాటరీ ఉన్న స్మార్ట్‌ఫోన్ రియల్‌మీ జీటీ 7. చైనీస్ మోడల్లో ఇది 100 వాట్ వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్‌తో 7,200 ఎంఏహెచ్ సామర్థ్యంతో ఉంది. అదే ఇండియన్ రియల్‌మీ జీటీ 7 వెర్షన్‌లో అయితే 120వాట్ వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్‌తో 7,000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






## రష్యా ఎలాంటి రాయితీ ఇవ్వడానికి సిద్ధంగా ఉందో స్పష్టత లేదన్న జెలెన్‌స్కీ

రష్యా ద్వైపాక్షిక చర్చలకు సానుకూలంగా స్పందించని పక్షంలో అమెరికా జోక్యం చేసుకుని గట్టిగా స్పందించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కోరారు. భూభాగం విషయంలో రష్యా ఎలాంటి రాయితీలు ఇవ్వడానికి సిద్ధంగా ఉందో అన్న విషయంపై స్పష్టత లేదని ఆయన అన్నారు. తమ ప్రతిపాదన ఏమిటో తెలియాలంటే ముందు మాస్కో తన అభిప్రాయం వెల్లడిరచాలని ఆయన పేర్కొన్నారు.జకర్‌పట్టియ ప్రాంతంలో రష్యా జరిపిన దాడిలో అమెరికన్లతో సహా పలువురు తీవ్రంగా గాయపడ్డారని జెలెన్‌స్కీ తెలిపారు. ఈ యుద్ధాన్ని ముగించేందుకు అర్థవంతమైన చర్చలకు వారు సిద్ధంగా ఉన్నారా అనే విషయంలో ఎటువంటి సంకేతాలు వెలువడలేదని అన్నారు.ఈ నేపథ్యంలో బలమైన ఒత్తిడి, ఆంక్షలు, టారిఫ్‌లు అవసరమని అభిప్రాయపడ్డారు. ద్వైపాక్షిక చర్చల అంశంపై తాము తొలుత అంగీకారం తెలిపినప్పటికీ రష్యన్లు సిద్ధంగా లేరని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. అదే సమయంలో చర్చలకు వేదికగా ఎంపిక చేసిన బుడాపెస్ట్ కూడా ఒక సవాలే అని ఆయన అభిప్రాయపడ్డారు.

## చైనా సరిహద్దుకు 27 కి.మీ. దూరంలో కొరియా రహస్య అణు స్థావరం

అంతర్జాతీయ సమాజం కళ్లుగప్పి ఉత్తర కొరియా మరో రహస్య క్షిపణి స్థావరాన్ని నిర్మించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చైనా సరిహద్దుకు అత్యంత సమీపంలో ఏర్పాటు చేసిన ఈ స్థావరంలో అమెరికాను సైతం లక్ష్యంగా చేసుకోగల ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు ఉన్నాయని వాషింగ్టన్‌కు చెందిన సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ తన తాజా నివేదికలో వెల్లడిరచింది. ఈ పరిణామం అమెరికా భద్రతా వర్గాల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. సీఎస్‌ఐఎస్ నివేదిక ప్రకారం, ఉత్తర కొరియాలోని నార్త్ ప్యోంగ్యాన్ ప్రావిన్స్‌లో ఉన్న ఈ స్థావరం పేరు 'సిన్‌పుంగ్‌డాంగ్'. ఇది చైనా సరిహద్దు నుంచి కేవలం 27 కిలోమీటర్ల దూరంలో ఉంది. 2003 నుంచి తీసిన ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించినప్పుడు ఈ స్థావరం నిర్మాణం 2004లో మొదలై, 2014 నాటికి పూర్తయిందని తేలింది. అప్పటి నుంచి ఇది చురుగ్గా పనిచేస్తున్నట్లు నివేదిక స్పష్టం చేసింది. ఉత్తర కొరియా ఇప్పటివరకు ప్రపంచానికి అధికారికంగా వెల్లడిరచని 15 నుంచి 20 రహస్య క్షిపణి స్థావరాలలో ఇది కూడా ఒకటని సీఎస్‌ఐఎస్ పేర్కొంది. ఈ స్థావరంలో అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగల 6 నుంచి 9 హ్వాసాంగ్ 15 లేదా హ్వాసాంగ్ 18 వంటి అత్యంత శక్తిమంతమైన క్షిపణులు ఉండే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. వీటిని మొబైల్ లాంచర్ల ద్వారా ప్రయోగిస్తారని, ఈ క్షిపణులు తూర్పు ఆసియాతో పాటు అమెరికా ప్రధాన భూభాగానికి కూడా పెను ముప్పుగా పరిణమించగలవని హెచ్చరించింది. ఆశ్చర్యకరంగా, అమెరికా-ఉత్తర కొరియా మధ్య గతంలో జరిగిన అణ్వస్త్ర నిరాయుధీకరణ చర్చల్లో ఈ స్థావరం ప్రస్తావనే రాలేదని నివేదిక తెలిపింది. యుద్ధం లేదా అత్యవసర పరిస్థితుల్లో ఈ క్షిపణులను భూగర్భ స్థావరాల నుంచి బయటకు తీసుకొచ్చి, ముందే సిద్ధం చేసుకున్న ప్రదేశాల నుంచి ప్రయోగిస్తారని సీఎస్‌ఐఎస్ వివరించింది. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న ఉత్తర కొరియా క్షిపణి నెట్‌వర్క్‌లో సిన్‌పుంగ్‌డాంగ్ స్థావరం కీలకమైనదని, ఇది ఆ దేశం తన అణు సామర్థ్యాన్ని, దాడి చేసే శక్తిని నిరంతరం పెంచుకుంటోందనడానికి నిదర్శనమని నివేదిక అభిప్రాయపడిరది.

## ట్రంప్ 50% సుంకాలపై జెఫ్రీ సాచ్స్ ఆగ్రహం..



ప్రముఖ అమెరికా ఆర్థికవేత్త జెఫ్రీ సాచ్స్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% సుంకాలను తీవ్రంగా ఖండిరచారు. ఈ నిర్ణయాన్ని అమెరికా విదేశాంగ విధానంలో ''అత్యంత తెలివితక్కువ చర్య''గా అభివర్ణించిన ఆయన, ఇది ఆర్థిక మరియు భౌగోళిక రాజకీయ దృష్ట్యా విఫలమవుతుందని హెచ్చరించారు. ఈ సుంకాలు అమెరికా ఆర్థిక వ్యవస్థకు హాని కలిగించడమే కాకుండా, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తాయని, అమెరికా రాజ్యాంగంలోని ఆర్టికల్ I, సెక్షన్ 8 కింద కాంగ్రెస్ అధికారాలను కాలరాస్తాయని సాచ్స్ వాదించారు. ఈ సుంకాలపై అమెరికా అప్పీలేట్ కోర్టులో ప్రస్తుతం వ్యాజ్యం కొనసాగుతోందని, ఇవి రాజ్యాంగ విరుద్ధమని నిరూపితం కావచ్చని ఆయన సూచించారు. ఈ సుంకాలు భారత్‌పై ఒత్తిడి తెచ్చే వ్యూహంగా పనిచేస్తున్నాయని, ఇవి భారత్‌అమెరికా సంబంధాలను దెబ్బతీస్తున్నాయని సాచ్స్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ రష్యా నుండి చమురు దిగుమతులు కొనసాగించడం కారణంగా ట్రంప్ జులైలో 25% సుంకాలను ప్రకటించారు, ఆ తర్వాత కొన్ని రోజులకే మరో 25% పెంచి మొత్తం 50%కి చేర్చారు. ఈ చర్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం జరుగుతున్న చర్చలను దెబ్బతీసిందని, ఆసియాలో అమెరికాకు కీలక భాగస్వామి అయిన భారత్‌తో విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ సుంకాలు విధించడం వల్ల ఏ విధమైన వ్యూహాత్మక లాభం సాధించలేదని, బదులుగా దీRIజు దేశాల (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) ఐక్యతను బలపరిచిందని సాచ్స్ విమర్శించారు. సాచ్స్ మాట్లాడుతూ, భారత్ ఒక గొప్ప శక్తిగా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కొనసాగించాలని సూచించారు. అమెరికాతో క్వాడ్ ద్వారా చైనాకు వ్యతిరేకంగా జట్టు కట్టడం ద్వారా భారత్ దీర్ఘకాలిక భద్రతను సాధించలేదని, బదులుగా చైనా, రష్యా, బ్రెజిల్ వంటి దేశాలతో సంబంధాలను బలోపేతం చేయాలని ఆయన సలహా ఇచ్చారు. భారత్‌ను అమెరికా విశ్వసనీయ వాణిజ్య భాగస్వామిగా భావించడం సరికాదని, అమెరికా ఆసక్తులు భారత్ ఆసక్తులతో సమానంగా ఉండవని ఆయన హెచ్చరించారు. ప్రధానమంత్రి మోదీ ఈ సంక్షోభాన్ని హుందాగా, దౌత్యపరంగా ఎదుర్కొంటున్న తీరును సాచ్స్ ప్రశంసించారు.

# మాస్కోలో పుతిన్‌ను కలిసిన జైశంకర్



భారత్‌రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరో కీలక మలుపు తీసుకున్నాయి. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను మాస్కోలో కలిశారు. ఈ భేటీ అంతర్జాతీయంగా విశేష ప్రాధాన్యత పొందింది.ఈ సమావేశం భారత్‌రష్యాల మధ్య జరగబోయే వార్షిక శిఖరాగ్ర సమావేశానికి భాగంగా జరిగింది. భవిష్యత్ దిశపై చర్చలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై పునర్విమర్శ సాగింది.ఈ భేటీలో ముఖ్యంగా ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధ పరిణామాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. పుతిన్ తన విశ్లేషణను జైశంకర్‌తో పంచుకున్నారు.పుతిన్ విశ్లేషణను జైశంకర్ ప్రశంసించారు. ఆయన చెప్పిన అంశాలు సందర్భానుసారంగా, లోతుగా ఉన్నాయి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జైశంకర్, ప్రధానమంత్రి మోదీ మరియు రాష్ట్రపతి ముర్మ తరఫున శుభాకాంక్షలు పుతిన్‌కు అందజేశారు. ఇది సంబంధాల్లో గౌరవ భావనను ప్రతిబింబిస్తుంది.జైశంకర్, పుతిన్‌కు వార్షిక శిఖరాగ్ర సమావేశ ఏర్పాట్లు గురించి వివరించారు. రెండు దేశాల మధ్య సహకారం ఎలా పెరుగుతుందో చర్చించారు.ఈ భేటీకి ముందు రష్యా ఉప ప్రధాని మాంటురోవ్, విదేశాంగ మంత్రి లావ్రోవ్‌లతో జైశంకర్ చర్చించారు. ఆ చర్చల వివరాలు కూడా పుతిన్‌కి తెలియజేశారు. భారత్‌రష్యాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడేందుకు ఈ భేటీ దోహదపడిరది. ఇరు దేశాలనూ కలిపే దారిగా మారింది. ఉక్రెయిన్ విషయాల్లో భారత్ ఎప్పుడూ న్యాయపరమైన, సమతుల్య దృక్కోణంతో ఉందని ఇది చాటింది. సంభాషణలే పరిష్కారాలకు దారి తీస్తాయని ఇండియా స్పష్టం చేస్తోంది.ఈ సమావేశంపై జైశంకర్ తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆయన సందేశం అనేక మంది దృష్టిని ఆకర్శించింది.ఈ సమావేశం, ముందుగా జరిగి శిఖరాగ్ర సమావేశానికి బలమైన వేదికను సిద్ధం చేసింది. ఇది ద్వైపాక్షిక సంబంధాల్లో మరో కీలక అడుగు.ప్రపంచంలో మారుతున్న పరిణామాల మధ్య, భారత్‌రష్యా అనుబంధం శక్తివంతంగా కొనసాగుతోంది. ఈ భేటీ దానికి మరో బలమైన ఉదాహరణ.

# ఉక్రెయిన్ భద్రతపై జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు



గత మూడేళ్లుగా రష్యాతో కొనసాగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ భద్రతను కాపాడటానికి యూరప్? ప్రధాన బాధ్యతను తీసుకోవాలని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు. భౌగోళికంగా దగ్గరగా ఉండటంతో పాటు ప్రత్యక్ష భద్ర పై ఉందని నొక్కి చెప్పారు. ఉక్రెయిన్ గడ్డపైకి తమ సైన్యాన్ని పంపేది లేదని ట్రంప్ స్పష్టం చేసినట్లు ప్రకటించిన కొద్ది సేపటికే, జేడీ వాన్స్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు 'యుద్ధం ముగించే ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి అమెరికా సిద్ధంగా ఉంది. కానీ యుద్ధానంతరం ఉక్రెయిన్?కు ఆర్థిక సహాయం చేయడం, భద్రతా హామీలను ఇవ్వడం యూరప్? దేశాలపై ఉంది. ఈ భారం మేం మోయాలని అనుకోవడం లేదు. యుద్ధాన్ని ముగించి, ప్రాణ నష్టాన్ని ఆపడానికి అవసరమైతే మేం సహాయం చేస్తాం. కానీ ప్రధాన బాధ్యత యూరప్?దే. అధ్యక్షుడు కూడా స్పష్టంగా చెప్పినట్లే యూరప్ ముందడుగు వేయాలి. అమెరికా చర్చలకు సిద్ధంగా ఉంది కానీ యుద్ధాన్ని ఆపడానికి అవసరమైన అంశాలు స్పష్టమయ్యే వరకు ఎలాంటి నిబద్ధతలను చేయదు. ఉక్రెయిన్ గడ్డపైకి అమెరికా సైన్యాన్ని పంపేది లేదని దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారని వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి కెరోలిన్ లీవిట్ వెల్లడిరచారు. అయితే గగనతలం సహా ఇతరత్రా ఆప్షన్లు మిగిలి ఉన్నాయని ఆమె తెలిపారు. ఉక్రెయిన్ భద్రత కోసం ఏవిధమైన సైనిక సహాయాన్ని అందించాలనే అంశం అమెరికా ప్రెసిడెంట్ పరిధిలో ఉందన్నారు. ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో ఇప్పుడే కచ్చితంగా చెప్పలేమన్నారు. ఐరోపాలోని మిత్రదేశాలను సమన్వయం చేసుకుంటూ, ఉక్రెయిన్‌కు తగిన భద్రతను కల్పిస్తామని ఆమె తెలిపారు. ఈ క్రమంలోనే ఉక్రెయిన్ భద్రతా విషయంలో యూరప్ దేశాలే బాధ్యత తీసుకోవాలని జేడీ వాన్స్ అన్నారు. ఇదిలా ఉండగా జులైలో ట్రంప్ సర్కార్? నాటోతో ఒక కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడిరచారు.

# వీధి కుక్కల అంశంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు



వీధి కుక్కల అంశంలో సుప్రీంకోర్టు తన గత తీర్పును సవరించింది. వీధి కుక్కలను స్టెరిలైజ్ చేసి, వాటిని రిలీజ్ చేయాలని ఇవాళ అత్యున్నత న్యాయ స్థానం తన తాజా తీర్పులో ఆదేశించింది. ఢిల్లీలో ఎక్కడ నుంచి తీసుకెళ్లిన కుక్కలను, స్టెరిలైజ్ చేసిన తర్వాత వాటిని అక్కడే వదిలేయాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. వీధి కుక్కలను షెల్టర్లలో వేయడం వల్ల.. ఆ షెల్టర్లు కిక్కిరిసిపోయాయని, దాని వల్ల వీధి కుక్కల ఆరోగ్యం ఆందోళనకరంగా మారినట్లు కోర్టు వెల్లడిరచింది. వ్యాక్సినేషన్ తర్వాత కుక్కలను రిలీజ్ చేయాలని సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్‌ను కఠినంగా అమలు చేయాలని కోర్టు పేర్కొన్నది. అయితే దూకుడు ప్రవర్తన ఉన్న కుక్కలను, రేబిస్ వ్యాధితో ఉన్న కుక్కలను పబ్లిక్ స్థలాల్లో వదలవద్దు అని కోర్టు తెలిపింది. అలాంటి కుక్కలను డాగ్ షెల్టర్లలోనే ఉంచాలని కోర్టు ఆదేశించింది. ఆగస్టు 11వ తేదీన ఇచ్చిన తీర్పులో.. వీధికుక్కలను షెల్టర్ హౌజ్‌లకు తరలించాలని కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతా, ఎన్వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం తీర్పును ఇచ్చింది. డీవార్మింగ్, వ్యాక్సినేషన్ తర్వాత వీధి కుక్కలను షెల్టర్ల నుంచి రిలీజ్ చేయాలని ధర్మాసనం తెలిపింది. అయితే బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలకు ఆహారాన్ని అందించడం నిషేధించాలని కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. వీధి కుక్కలకు ఆహారం అందించేందుకు నిర్దేశిత ప్రదేశాలను ఏర్పాటు చేయాలని కోర్టు తెలిపింది.

# ఉభయ సభల్లో 15 బిల్లులకు గ్రీన్‌సిగల్



న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షకాల సమావేశాలు తుడిచిపెట్టుకుపోయాయి. బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)పై చర్చకు ప్రభుత్వం సిద్ధపడకపోవడంతో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు వాయిదాల పర్వం తొక్కాయి. అయినప్పటికీ ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే మూజువాణి ఓటుతో పార్లమెంట్ ఉభయ సభల్లో 15 బిల్లులు ఆమోదం పొందాయి. జులై 21న ప్రారంభమైన పార్లమెంట్ వర్షకాల సమావేశాలు ఆగస్టు 21తో ముగిశాయి. ఈ సమావేశాలు 32 రోజుల పాటు నిర్వహించగా, అందులో 21 రోజులు సభా కార్యకలాపాలు జరిగాయి. లోక్‌సభలో 14 బిల్లులు ప్రవేశపెట్టగా, 12 బిల్లులు ఆమోదం పొందాయి. రాజ్యసభలో 15 బిల్లులకు ఆమోదం లభించింది. ఉభయ సభల్లో మొత్తం 15 బిల్లులు ఆమోదం పొందాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. గురువారం పార్లమెంట్ వర్షకాల సమావేశాలు ముగిసిన తర్వాత పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడారు. ''పహల్గామ్ ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రత్యేక చర్చ జరిగింది. లోక్‌సభలో 18.41 గంటల పాటు చర్చ జరగగా, 73 మంది చర్చల్లో పాల్గొన్నారు. రాజ్యసభలో 16.25 గంటల పాటు చర్చ జరగగా, 65 మంది సభ్యులు చర్చల్లో పాలు పంచుకున్నారు. అలాగే మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ఆగస్టు 13 నుంచి మరో ఆరు నెలల పాటు పొడిగించే తీర్మానాన్ని ఆమోదించాం. లోక్‌సభలో 'వికసిత్ భారత్' కోసం అంతరిక్ష కార్యక్రమం కీలక పాత్ర %% అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారతదేశపు మొదటి వ్యోమగామిపై ప్రత్యేక చర్చ ప్రారంభమైంది. కానీ సభలో నిరంతర అంతరాయం కారణంగా, చర్చ పూర్తి కాలేదు. దీంతో లోక్‌సభ ఉత్పాదకత సుమారు 31 శాతం, రాజ్యసభ ఉత్పాదకత సుమారు 39 శాతంగా ఉంది. లోక్‌సభలో ఈ సమావేశంలో మొత్తం 120 గంటల్లో 37 గంటలు మాత్రమే చర్చలు జరిగాయి. రాజ్యసభలో చర్చలు 41.15 గంటలు మాత్రమే జరిగాయి'' అని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పెద్దమందడి సింగిల్ విండో ద్వారా రైతులకు దీర్ఘకాలిక రుణాల పంపిణీ

◆ సింగల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

**పెద్దమందడి,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):**

సింగిల్ విండో పెద్దమందడి సంఘ సభ్యులకు శుక్రవారం కర్షకమిత్ర స్కీమ్ ద్వారా దీర్ఘకాలిక రుణాల చెక్కుల పంపిణీ జరిగిందని పెద్దమందడి సింగల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా సంఘ సభ్యులు శ్రీ శంకర్ నాయక్, రాములు నాయక్, సురేష్ నాయక్ లకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున, మొత్తం రూ.30 లక్షల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, సీఈఓ జగదీశ్వర్ రెడ్డి, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ రహదారి-163లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలి

◆ కేంద్ర మంత్రిని కోరిన వరంగల్ ఎంపీ కడియం కావ్య

**న్యూఢిల్లీ,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):**



వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శుక్రవారం ఢిల్లీలో కేంద్ర రహదారి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి 163 (హైదరాబాద్-భూపాలపట్నం రోడ్) లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేషనల్ హైవేను నాలుగు లైన్లుగా విస్తరించినప్పటికీ, నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘనపూర్, చిన్నపెండ్యాల్, కరుణాపురం గ్రామాల వద్ద సర్వీస్ రోడ్ల అనుసంధానం లేకపోవడం స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నట్లు ఎంపీ వివరించారు. లింక్ రోడ్లు లేకపోవడంతో గ్రామాల వాహనాలు నేరుగా ప్రధాన హైవేపైకి రావాల్సి రావడం రద్దీ, ప్రమాదాలకు దారితీస్తోందని తెలిపారు.నాలుగు లైన్ల విస్తరణ సమయంలోనే అవసరమైన భూమి సేకరణ పూర్తయిందని, ఇప్పుడు కేవలం నిర్మాణ పనులు మిగిలి ఉన్నాయని ఎంపీ పేర్కొన్నారు. అందువల్ల వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సమస్యను పరిశీలించి అవసరమైన సూచనలు సంబంధిత అధికారులకు ఇస్తామని హామీ ఇచ్చారని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు.






# తెలుగు సాహిత్య సేవలో ఓదేలు

## "జీవితమే కవిత్వం – కవిత్వమే సేవ"

**తెలుగు భాషా పట్ల అగాధమైన ప్రేమతో, సాహిత్య సేవతో, కవిత్వ చైతన్యంతో, పోలియో అడ్డంకిని కూడా జీవిత విజయంలో ఒక పాఠంగా మలుచుకున్న వ్యక్తిత్వం**

-డా. కుమ్మరి ఓదేలు.

### కష్టాల మబ్బుల మధ్య వెలుగైన దీపం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం గుడిపహాడ్ గ్రామంలో సాధారణ కుటుంబంలో జన్మించిన కుమ్మరి ఓదేలు చిన్న వయసులోనే పోలియో బారినపడి శారీరక వైకల్యం ఎదుర్కొన్నారు. ఒక చిన్నారి జీవితాన్ని పూర్తిగా మార్చేసే ఈ వ్యాధి, ఆయనలో నిరాశను కలిగించలేకపోయింది. చదువుపై ఆసక్తి, భవిష్యత్తుపై నమ్మకం ఆయనకు బలమైన ఆయుధాలుగా మారాయి. తండ్రి అకాల మరణం తర్వాత కుటుంబం కష్టాల్లో కూరుకుపోయినా, తల్లి అండదండలతో విద్యను కొనసాగించారు.

తన పల్లె పాఠశాలలో చదువుకునే రోజుల్లోనే ఓదేలు తెలుగుపై గాఢమైన మమకారం పెంచుకున్నారు. నడవడం కష్టమయ్యే పరిస్థితుల్లోనూ పాఠశాలకు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్ళడం ఆయన కష్టసాధ్యమైన జీవన గాథలో ఒక ముఖ్య ఘట్టం.

### ఉపాధ్యాయ వృత్తిలో మార్గదర్శకత్వం

2007లో ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ గురుకుల బాలికల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా ఆయన తన వృత్తి జీవితం ఆరంభించారు. అప్పటి నుంచి పదహారేళ్లపాటు పలు జిల్లాల్లో బోధిస్తూ, వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దారు. ప్రస్తుతం వేలేరు గురుకుల బాలుర పాఠశాలలో సేవలందిస్తున్నారు.

ఓదేలుకు ఉపాధ్యాయ వృత్తి అంటే ఉద్యోగం కాదు, సమాజ సేవ. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో సాహిత్యాభిరుచి పెంపొందించడం, జీవిత విలువలను బోధించడం ఆయన ప్రత్యేకత. "బోధించే ప్రతి పాఠం, భవిష్యత్తు తరాలకు వెలుగునిచ్చే దీపం కావాలి" అనే ఆయన తత్వం, శిష్యులకు మార్గదర్శకంగా నిలుస్తోంది.

### సాహిత్య రంగంలో ప్రతిభ

తెలుగు సాహిత్యంలో ఓదేలుకు ప్రత్యేక స్థానం ఉంది. కథలు, పద్యాలు, వ్యాసాలు, నాటికలు - ఏ రంగంలోనైనా ఆయన కలం ప్రవహించింది. సమాజ సమస్యలు, మానవీయ విలువలు, తెలంగాణ భాషా మాధుర్యం ఆయన రచనలలో ప్రధాన అంశాలుగా ప్రతిఫలించాయి.

తెలుగు మహాసభలు, ఉగాది కవి సమ్మేళనాలు, భాషా దినోత్సవాలు, బాలకవి సభలు వంటి పలు వేదికలపై ఆయన కవితలు వినిపించాయి. "భాషలో మన ఆత్మ ఉంటుంది. భాషను మరిస్తే మనల్ని మనమే కోల్పోతాం" అనే భావజాలాన్ని ఆయన ఎప్పటికప్పుడు పంచుతుంటారు.

### విద్యలో అచంచల దీక్ష

**ప్రాథమిక విద్యనుంచి పట్టభద్ర స్థాయివరకు వచ్చిన ప్రతి పరీక్షా ఓదేలును మరింత కఠినంగా పరీక్షించింది. కానీ ఆయన ప్రతిసారీ విజయం సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగు, అర్థశాస్త్రంలో ఉన్నత చదువులు పూర్తి చేశారు. అదే విశ్వవిద్యాలయం నుండి "వరంగల్ జిల్లా కథాసాహిత్యం పరిశీలన" అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా సంపాదించారు.**

**హైదరాబాద్‌లో రాష్ట్రపతి విశ్వవిద్యాలయం వేదికగా జరిగిన సన్మాన సభలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, అంతరిక్ష పరిశోధన సంస్థాధిపతి వి. నారాయణన్ సమక్షంలో డాక్టరేట్ పట్టా అందుకోవడం ఆయన జీవితంలోనే ఒక శిఖర ఘట్టంగా నిలిచింది. గ్రామం నుంచి ప్రారంభమైన ఆయన విద్యా యాత్ర, దేశస్థాయిలో గౌరవించబడటంతో ముగియడం సమాజానికి ఒక పాఠంలా నిలిచింది.**

### గౌరవాలు - గుర్తింపులు

**ఓదేలుకు రాష్ట్రస్థాయిలో అనేక సత్కారాలు లభించాయి. భాసర సుధార్థి సంస్థ నుండి ఉపాధ్యాయ రత్న బిరుదు అందుకున్నారు. కాళోజీ నారాయణరావు పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక సత్కారం అందుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలు, జయశంకర్ జయంతి వంటి ఉత్సవాల్లో ఆయన సేవలను గుర్తించి పలుమార్లు సత్కరించారు.**

### ప్రేరణగా నిలిచిన జీవితం

కష్టాలు, శారీరక వైకల్యం, ఆర్థిక సమస్యలు - అన్నింటినీ ఎదుర్కొని విజయాన్ని సాధించిన ఓదేలుయొక్క జీవితం నేటి తరాలకు ప్రేరణగా నిలుస్తోంది. తెలుగు భాషను ప్రేమించడం, విద్యకు అంకితభావం చూపడం, సమాజానికి సేవ చేయడం - ఇవన్నీ ఆయన వ్యక్తిత్వానికి ప్రత్యేక ఆకర్షణ.

"తెలుగు జీవిస్తేనే మన సంస్కృతి నిలుస్తుంది" అని ఎప్పుడూ నొక్కి చెబుతున్న ఓదేలు, భవిష్యత్ తరాలకు భాషా సంరక్షకుడిగా, జీవిత గురువుగా నిలుస్తున్నారు.



# మతసామరస్యానికి ప్రతీకగా కాజీపేట దర్గా ఉత్సవాలు

◆ వరంగల్ ఎంపీ కడియం కావ్య

◆ కాజీపేట సయ్యద్ షా అఫ్జల్ బియబాని దర్గా 174వ సందల్, ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ

◆ ముస్లింలతో పాటు అన్ని మతాల ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొనడం విశిష్ట సంప్రదాయం

◆ బీజేపీ మతోన్మాదం రెచ్చగొట్టి కుట్రలు చేస్తోందని ఎంపీ విమర్శ

◆ ఐకమత్యం, సౌభ్రాతృత్వమే భవిష్యత్తు తరాలకు రక్షణ అని పిలుపు

**ఖాజీపేట,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):**

కాజీపేట సయ్యద్ షా అఫ్జల్ బియబాని దర్గా వద్ద 174వ సందల్, ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో వరంగల్ ఎంపీ కడియం కావ్య పాల్గొని చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కాజీపేట దర్గా చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన స్థలం అని తెలిపారు. ప్రతి సంవత్సరం ముస్లింలతో పాటు అన్ని మతాల ప్రజలు ఉత్సవాల్లో పాల్గొనడం మతసామరస్యానికి ప్రతీక అని అన్నారు. సమాజంలో శాంతి, ఐక్యత నెలకొని అందరికీ సంతోషం కలగాలని ఆకాంక్షించారు.ప్రజల మధ్య విద్వేషాలు రేపే ప్రయత్నాలు సమాజానికి హానికరమని ఎంపీ పేర్కొన్నారు. ఎలాంటి మతగ్రంథంలోనూ ద్వేషం, హింసకు స్థానం లేదని స్పష్టం చేశారు. పక్కవారి ఆనందమే మన ఆనందం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ దేశంలో మత విభేదాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని, క్రిస్టియన్లు, ముస్లింలపై దాడులు జరగడానికి పరిస్థితులు సృష్టిస్తోందని ఎంపీ విమర్శించారు. ఓట్ల దొంగతనంతో ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. భవిష్యత్ తరాలకు శాంతి, ఐక్యత అవసరమని, అందుకు సమాజం మొత్తం ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హజ్ కమిటీ అధ్యక్షుడు ఖుస్రో పాషా, మేయర్ గుండు సుధారాణి, నాయకులు నాగరాజు, ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఎంపీ అభినందించారు.





# కార్మికుల సమస్యల పరిష్కార దిశగా అడుగులు

◆ మంత్రి సురేఖతో సమావేశమైన కార్మిక సంఘ నేతలు

**హన్మకొండ,ఆగస్టు22(తెలంగాణ ముచ్చట్లు):**



భవన నిర్మాణ రంగం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు పునాదిలా నిలుస్తోంది. ఈ రంగంలో శ్రమించే కార్మికుల కష్టం, చెమట వల్లే నగరాలు ఎదుగుతున్నాయి. అయితే, ఈ శ్రమజీవుల సమస్యలు మాత్రం ఇంకా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శ్రమశక్తి అవార్డు గ్రహీత గిన్నారపు మహేందర్, కార్మికుల తరపున అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను కలిశారు.ఈ సమావేశంలో గిన్నారపు మహేందర్, కార్మికుల కష్టాలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వయసు పైబడిన తరువాత ఆర్థిక భద్రత లేకపోవడం, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే కుటుంబాలు ఎదుర్కొంటున్న దుర్గతి, కార్మికులకు లభించాల్సిన సౌకర్యాలు సరిగా అందకపోవడం వంటి అంశాలను వివరించారు.

ఈ భేటీ భవన నిర్మాణ రంగ కార్మికుల్లో కొత్త నమ్మకాన్ని నింపిందని సంఘం నాయకులు భావిస్తున్నారు. వారి మాటల్లో, "మా చెమటతో భవనాలు, నగరాలు వెలసుతున్నాయి. మా సమస్యలు పరిష్కారమైతేనే సమాజం సమగ్రంగా ముందుకు సాగుతుంది" అనే సంకేతం స్పష్టంగా వినిపిస్తోంది.

### కార్మిక సంఘం ప్రధాన డిమాండ్లు:

- 55 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికునికి పెన్షన్ సదుపాయం కల్పించాలి.
- కార్మిక కార్డు శాశ్వత కాలం చెల్లుబాటు అయ్యేలా చేయాలి.
- ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబానికి 10 లక్షల ఆర్థిక సాయం ఇవ్వాలి.
- సహజ మరణం చెందిన కార్మిక కుటుంబానికి 2 లక్షల ఆర్థిక సాయం అందించాలి.
- కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ పదవి కార్మికుడికే ఇవ్వాలి.
- కార్మికుల వృద్ధి కోసం 10 లక్షల రుణ సౌకర్యం కల్పించాలి.

ఈ అంశాలన్నింటినీ ఓపికగా విన్న మంత్రి సురేఖ, "కార్మికుల కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది. మీ వినతిని ముఖ్యమంత్రికి నివేదించి, తగిన చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తాను" అని హామీ ఇచ్చారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in